మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట





వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అదనపు కలెక్టర్ జిల్లా అధికారులు

## తప్పులు లేని ఓటరు జాబితా రూపొందించాలి:జిల్లా కలెక్టర్

**గద్వాల , సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:** తప్పులు లేని ఓటరు జాబితా రూపోందించేందుకు స్పెషల్ సమ్మరీ కింద బూత్ లెవల్ అధికారులు ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ ఆదేశించారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సి.సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి ఓటరు జాబితాపై పలు సూచనలు చేశారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌కు బూత్ లెవల్ అధికారి ఉండాలని, ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహించి కొత్త ఓటర్ల నుండి ఫారం 6 తీసుకోవడం మరణించిన, శాశ్వతంగా తరలిపోయిన వారి వివరాలు ఫారం 7,8 లు స్వీకరించి వేగవంతంగా పరిష్కరించాలన్నారు. బూత్ లెవల్ సూపర్‌వైజర్‌లు, ఏఈఆర్‌ఓలు పక్కాగా పర్యవేక్షణ చేయాలని సూచించారు. పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ కొరకు ప్రతిపాదనలు సిద్ధంగా ఉంచుకుని ఈఆర్‌ఓ నెట్‌లో అప్లోడ్ చేయాల్సి ఉంటుందని తెలియజేశారు. కొత్త ఓటర్ల ఎపిక్ కార్డులు ప్రింటింగ్ నిమిత్తం వివరాలు ఎప్పటికప్పుడు పంపించాలని ఆదేశించారు. అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడుతున్న బిఎల్‌ఓలు ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహించి వివరాలు సేకరించాలని ఆదేశించారు. మరణించిన లేదా శాశ్వతంగా తరలిపోయిన వారి పేర్లు ఓటరు జాబితా నుండి తొలగించేందుకు చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఓటరు జాబితాలో తప్పులు లేకుండా ఉండేందుకు తాహసిల్దార్లు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాసరావు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రైల్వేగేటు సమస్యకు పరిష్కారం..

**- కొండ ప్రశాంత్‌రెడ్డితో కలిసి ఎంపి డికె అరుణ పర్యటన**

**దేవరకద్ర,సెప్టెంబరు 24 ప్రభాతవార్త:** దేవరకద్రలో మూసివేసిన రైల్వేగేటు సమస్యకు త్వరలో పరిష్కారం లబిస్తుందని మహబూబ్ నగర్ ఎంపి డీకే అరుణ అన్నారు.దేవరకద్రలో మంగళవారం దేవరకద్ర బిజేపి నియోజకవర్గ ఇంచార్జి కొండ ప్రశాంత్‌రెడ్డితో కలిసి ఎంపి పర్యటించారు.స్థానిక రైల్వే గేటు మూసి వేయడంతో గత కొన్ని రోజులుగా స్థానికులతో పాటు వ్యాపారస్థులు, ప్రజలు,ప్రయాణికులు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు.దీంతో ఈ సమస్యను తెలుసుకోవడానికి దేవరకద్రలో మూసివేసిన స్థానిక రైల్వేగేటును కొండప్రశాంత్‌రెడ్డితో కలసి ఎంపి పరిశీలించారు.అనంతరం ఎంపి మాట్లాడుతూ ప్రజల సమస్యలను దృష్టిలో పెట్టుకొని త్వరలో దేవరకద్రలో మూసి వేసిన రైల్వేగేటు వద్ద అండర్ బ్రిడ్జ్ నిర్మాణానికి కృషిచేస్తానని,రైల్వే అధికారులతో మాట్లాడి అండర్‌బ్రిడ్జ్ నిర్మాణం జరిగేలా చూస్తానన్నారు. వ్యాపారస్థులకు,ప్రజలకు ఈ విషయంలో బిజేపి అండగా ఉంటుందన్నారు. పలుమార్లు ఈసమస్యను కొండప్రశాంత్‌రెడ్డి తమ దృష్టికి తీసుకరావడం జరిగిందని అందుకే సమస్యను స్వయంగా తెలుసుకోవడానికి దేవరకద్రకు వచ్చానన్నారు.ఈ కార్యక్రమంలో దేవరకద్ర మండలం బిజేపిఅధ్యక్షుడు కృష్ణంరాజు,ఓబిసి కార్యవర్గ సభ్యుడు దేవన్నసాగర్,పార్టీ జిల్లా కార్యదర్శి నారాయణరెడ్డి,ప్రధానకార్యదర్శి రాచాల రాజు,నాయకులు గోపాల్,హోటల్ అంజిలతో పాటు పార్టీ నాయకులు,కార్యకర్తలు,వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.



దేవరకద్రలో రైల్వేగేటు సమస్యను ఎంపికి వివరిస్తున్న కొండ ప్రశాంత్‌రెడ్డి

## దరఖాస్తులు పెండింగ్ ఉంచొద్దు

**లే అవుట్ల రెగ్యులరైజేషన్ వేగవంతం చేయాలి**

**సమీక్షలో కలెక్టర్ విజయేంద్రబోయి**

**మహబూబ్‌నగర్ బ్యూరో,సెప్టెంబరు24 ప్రభాతవార్త :** లే అవుట్ల రెగ్యులరైజేషన్ పథకం కింద వచ్చిన దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ విజయేంద్రబోయి అన్నారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపిడిఓలు, ఎంపిఓలతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న లే అవుట్ల రెగ్యులరైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఇప్పటివరకు ఎన్నిదరఖాస్తులు వచ్చినవి,సరిగా లేని దరఖాస్తులను ఎన్ని రిజెక్ట్ చేసినారు, దరఖాస్తుతో పాటు అప్‌లోడ్ చేసిన, అన్ని ధృవ పత్రాలు సరైనవిగా ఉన్నట్లయితే లే అవుట్లు రెగ్యులరైజేషన్ చేయాలని, ఒకవేళ ఏవైనా ధృవపత్రాలు లేనట్లయితే సంబంధిత దరఖాస్తుదారులు కావలసిన ధృవ పత్రాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసినట్లయితే రెగ్యులేషన్‌కు అనువుగా ఉంటుందని వారికి తెలపాలని అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామ,మండలస్థాయిలలో నిర్వహిస్తున్న స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా రోజువారి కార్యక్రమాల వారిగా శ్రమదానం, మానవహారం వంటి వివిధ కార్యక్రమాలను పోర్టల్‌లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని, గ్రామస్థాయిలో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులను, డంపింగ్ యార్డు, సెగ్రిగేషన్ షెడ్ల వద్ద చెత్తను వేరు చేయడం, చెత్త వేరు చేసే విధానాన్ని గ్రామస్తులకు తెలిసేలా గ్రామస్థాయిలో ఒక వర్క్‌షాపును ఏర్పాటు చేయాలని, స్వయం సహాయక బృందాలకు రుణాలు మంజూరయ్యేలా చూడాలని, శ్రీనిధి రుణాల చెక్కుల పంపిణీ త్వరగా జరిగేలలా కృషి చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జిల్లా పరిషత్ సీఈఓ వెంకటరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి పార్థసారథి, డిఆర్‌డిఓ నరసింహులు, ఎంపిడిఓలు, ఎంపిఓలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ఎమ్మెల్యే ఆదేశాలతో అలుగు పారుతున్న పెద్ద చెరువును పరిశీలించిన**

**మున్సిపల్ ఛైర్మన్ ఆనంద్‌గౌడ్, కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి**

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 24 ప్రభాతవార్త :** ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పట్టణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గత రాత్రి కురిసిన భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో చాలాచోట్ల నీరు రావడంతో పాటుగా కొత్త చెరువు అలుగు పారడంతో దానిపై అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వెంటనే మున్సిపల్ ఛైర్మన్ ఆనంద్‌గౌడ్, ఇతర అధికారులతో మాట్లాడి, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా,నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి సహాయం చేయాలని,అవసరమైనచోట ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే ఆదేశానుసారం డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రి ఆధ్వర్యంలో ఉదయం నుంచే మహబూబ్‌నగర్ కొత్తచెరువు దగ్గర మున్సిపల్ ఛైర్మన్, కమిషనర్, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అలుగు పారుతున్న నీటిని జెసిబితో లోతట్టు ప్రాంతాలకు తరలించారు. లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తూ జాగ్రత్తగా ఉండాలని సందేశాలు పంపించారు. కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రి, మున్సిపల్ ఛైర్మన్ ఆనంద్‌గౌడ్, కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, మార్కెట్ కమిటి వైస్ ఛైర్మన్ పెద్ద విజయ్‌కుమార్, మడుగు నాగరాజు, మడుగు శంకర్, కాలనీ వాసులు పాల్గొన్నారు.



చెరువును పరిశీలిస్తున్న మున్సిపల్ ఛైర్మన్

## 24 గంటలు 41 కాన్పులు..

**విజయవంతంగా చేపట్టిన మహబూబ్‌నగర్ జనరల్ దవాఖాన వైద్యులు**

**వివరాలు వెల్లడించిన సూపరింటెండెంట్ సంపత్‌కుమార్‌సింగ్**

**మహబూబ్‌నగర్ బ్యూరో,సెప్టెంబరు24 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో 24 గంటల్లో 41కాన్పులు జరిగాయని ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సంపత్‌కుమార్ సింగ్ తెలిపారు. మంగళవారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు -మిగతా4లో..



డెలివరీ అనంతరం వివరాలు వెల్లడిస్తున్న వైద్యులు

# పాలమూరు ఎత్తిపోతలపై ఫోకస్..




- ఇప్పటికే పలుమార్లు సమీక్షించిన సీఎం రేవంత్‌రెడ్డి
- నేడు ఉమ్మడి జిల్లా ప్రాజెక్టుల సందర్శనకు మంత్రులు
- ఉదండాపూర్, గట్టు, శంకరసముద్రం, నార్లాపూర్, వట్టెం రిజర్వాయర్ల విజిట్
- ఏడాదిగా నిలిచిన ప్రాజెక్టు పనులు

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్ 24, ప్రభాతవార్త :** పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులపై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టి సారించారు. ఈ పథకంపై ఇప్పటికే పలుమార్లు అధికారులతో ముఖ్యమంత్రి సమీక్షించారు. పనుల పురోగతిపై ఆరా తీశారు. ఈక్రమంలో బుధవారం పాలమూరు ప్రాజెక్టుల సందర్శనకు మంత్రుల బృందం రానున్నది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్ల నియోజకవర్గంలోని ఉదండాపూర్ రిజర్వాయర్‌తోపాటు, గద్వాల నియోజకవర్గంలోని గట్టు, వనపర్తిలోని శంకరసముద్రం, నాగర్‌కర్నూల్ జిల్లాలోని నార్లాపూర్, వట్టెం రిజర్వాయర్ల సందర్శించనున్నారు. రిజర్వాయర్ల సందర్శనకు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు, ఉమ్మడి జిల్లా అధికారులు రానున్నారు. గత ప్రభుత్వం హయాంలోనే పనులు యుద్ధప్రాతిపదికన కొనసాగినా గత ఏడాది కాలంగా పురోగతి లేకపోవడంతో ఎక్కడికక్కడే పెండింగ్ పడ్డాయి. ఉదండాపూర్ రిజర్వాయర్ పూర్తయితే జడ్చర్ల నియోజకవర్గం సస్యశ్యామలం అవుతుంది. ఈక్రమంలో మంత్రులు రానున్న నేపథ్యంలో ప్రాజెక్టు పనులు ఊపందుకోనున్నట్లు తెలుస్తున్నది.

**ఇదీ పాలమూరు ప్రాజెక్టు స్వరూపం**

పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం 2015 జూన్ 11న గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన చేశారు. ఉమ్మడి పాలమూరు -రంగారెడ్డి జిల్లాలోని 12.30లక్షల ఎకరాలకు సాగునీరు, 1226 గ్రామాలకు తాగునీరు అందించేందుకు పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని రూపొందించారు. రూ.32వేలకోట్ల అంచనా వ్యయంతో ప్రారంభమైన పథకం పనులు ప్రస్తుతం సుమారు రూ.50వేల కోట్లకు చేరాయి. ఇందులో భాగంగా గత ప్రభుత్వ హయాంలోనే మొదటి పంప్ నార్లాపూర్ వద్ద డ్రైరన్ విజయవంతం అయిన సంగతి తెలిసిందే. దీంతో ప్రాజెక్టులోని తొమ్మిది మోటార్లలో మొదటి మోటార్ డ్రైరన్ సక్సెస్‌ఫుల్‌గా నిర్వహించారు.

**ఇదీ ఉదండాపూర్ ముఖచిత్రం..**

జడ్చర్ల నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయడానికి పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా ఉదంపూర్ ఎత్తిపోతల పథకం రూపుదిద్దుకుంటున్నది. ఎత్తిపోతల ద్వారా సముద్ర మట్టానికి 650 మీటర్ల ఎత్తులో ఉన్న పాలమూరు రైతులకు సాగుజలాలతోపాటు తాగునీటి కష్టాలను శాశ్వతంగా పారద్రోలేందుకు రూపొందించిన మహత్తర పథకం. 5214ఎకరాలకు పైగా భూముల కేటాయింపుతో..రూ.6616.4కోట్ల ప్రతిపాదిత వ్యయంతో 10లక్షల ఎకరాలకు సాగునీరుతోపాటు హైదరాబాద్ లాంటి మహానగరం తాగునీరందించేందుకు రూపొందిన మహత్తర పథకం ఉదండాపూర్ రిజర్వాయర్. వీటితోపాటు ఫార్మా కంపెనీలకు, దివిటిపల్లి ఐటీ కారిడార్‌కు నీటివసతి కూడా కల్పించేందుకు అనుగుణంగా డిజైన్ చేయబడింది. 16,17,18 మూడు ప్యాకేజీలుగా పథకానికి రూపకల్పన చేశారు. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతలలో భాగంగా 5వ రిజర్వాయర్‌గా ఉదండాపూర్ నిర్మాణం చేపట్టారు. 16.03 టీఎంసీల స్టోరేజ్ కెపాసిటీతో నిర్మాణంలో ఉన్నది. 2850 మంది నిర్వాసితులకు..316ఎకరాల భూమిని సేకరించి దేవుని గుట్టతండా వద్ద రూ.171.55 కోట్లతో ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ఏర్పాటు పనులు గత ప్రభుత్వంలో ప్రారంభమయ్యాయి. ప్రాజెక్టు పూర్తయితే జడ్చర్ల నియోజకర్గంలోని ప్రతి ఎకరాకూ సాగునీరందుతుంది. వ్యవసాయ బోర్లు రీచార్జి అవుతాయి. తాగునీటి గోస శాశ్వతంగా తీరుతుంది. చెరువులు, కుంటలకు జలకళ సంతరించుకుంటుంది.

| రిజర్వాయర్ | నీటినిల్వ సామర్థ్యం (టీఎంసీలు) | బండ్ పొడువు (కి.మీ.) |
|---|---|---|
| అంజనగిరి (నార్లాపూర్) | 8.51 | 6.647 |
| వీరాంజనేయ (ఏదుల) | 6.55 | 7.716 |
| వెంకటాద్రి (వట్టెం) | 16.74 | 14.750 |
| కురుమూర్తిరాయ (కర్వెన) | 17.34 | 13.185 |
| ఉదండాపూర్ | 16.03 | 15.875 |
| కేపీ లక్ష్మీదేవిపల్లి | 2.80 | ప్రారంభంకాలేదు |

### నేడు మంత్రుల పర్యటన

- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహతోపాటు ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతోపాటు ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, అధికారులు బుధవారం ఉదండాపూర్ రిజర్వాయర్‌ను సందర్శించనున్నారు. బేగంపేట ఎయిర్ పోర్ట్ నుంచి హెలీకాప్టర్‌లో ఉదయం 7.50గంటలకు బయలుదేరి, 9గంటల వరకు ఉదండాపూర్ రిజర్వాయర్‌కు చేరుకుంటారు.
- 10.30గంటలకు గట్టు రిజర్వాయర్ సందర్శన
- మధ్యాహ్నం 12గంటలకు వనపర్తి జిల్లాలోని శంకరసముద్రం రిజర్వాయర్ సందర్శన
- మధ్యాహ్నం 2గంటలకు కొత్తకోటకు చేరుకుంటారు
- మధ్యాహ్నం 2.30గంటలకు నార్లాపూర్ రిజర్వాయర్ సందర్శన
- మధ్యాహ్నం 3.45గంటలకు నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ చేరుకుంటారు
- మధ్యాహ్నం 4.15గంటలకు వట్టెం పంపింగ్ స్టేషన్ సందర్శన
- సాయంత్రం 5గంటలకు ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టులపై సమీక్ష
- సాయంత్రం 6గంటలకు నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ నుంచి హెలీకాప్టర్ ద్వారా బేగంపేటకు బయలుదేరుతారు.



## సోలార్ విద్యుత్ పైలెట్ ప్రాజెక్టు

# పనులు వేగవంతం పూర్తి చేయాలి..

**- సోలార్ పైలెట్ ప్రాజెక్టుపై అధికారులు నిర్లక్ష్యం వహించరాదు: కలెక్టర్ బదావత్ సంతోష్**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:** టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్‌అలీ ఫరూఖీ హైదరాబాద్ నుంచి మం గళవారం నాడు జిల్లా కలెక్టర్, విద్యుత్ శాఖ అధికారులతో కొండా రెడ్డిపల్లి సౌర విద్యుత్ పనులపై గూగుల్ మీట్ నిర్వహించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నుంచి విద్యుత్ శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్‌అలీ ఫరూఖీ మాట్లాడుతూ తెలంగగాణ రాష్ట్రంలో ప్రభుత్వం సోలార్ విద్యుత్‌ను వినియోగించుకునే ప్రయత్నంలో భాగంగా పైలెట్ ప్రాజెక్టు గ్రామంగా సోలర్ విద్యుత్‌కు మార్చే ప్రయత్నంలో కింద ఎంపిక చేసిన కొండారెడ్డిపల్లి గ్రామంలో అధికారులంతా సోలర్ విద్యుత్‌పై అందుకు కావాల్సిన కార్యాచరణ ప్రణాళికను వేగవంతంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని, తాను త్వరలో గ్రామాన్ని సందర్శిస్తానని సీఎండీ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కొండారెడ్డిపల్లి గ్రామంలో సోలార్ విద్యుత్‌పై కొనసాగుతున్న పనులపై కలెక్టర్ సీఎండీకి వివరించారు. నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని కొండారెడ్డిపల్లి గ్రామంలోని గృహ అవసరాలకు సంబంధించి 499 సర్వీస్ కనెక్షన్లు ఉన్నాయని, వాణిజ్య అవసరాలకు సంబంధించి 66 సర్వీస్ కనెక్షన్లు, పరిశ్రమలకు సంబంధించి 10 సర్వీస్ కనెక్షన్లు, వ్యవసాయ కనెక్షన్లు 867 ఉన్నాయని, విద్యుత్ దీపాలకు సంబంధించి 2 కనెక్షన్లు ఉన్నాయని, వీటన్నిటికి కావాల్సిన ఓల్టేజీ దానికి తగిన ప్రణాళికలు సిద్ధంగా ఉన్నామన్నారు. కొండారెడ్డిపల్లి గ్రామంలో కొనసాగుతున్న గ్రామంలో సోలార్ విద్యుత్ పైలెట్ ప్రాజెక్టు ద్వారా రైతులు, గృహ సముదాయాలు, కుటుంబాల వారీగా పేర్లు నమోదు తదితర అంశాలను రానున్న మూడు రోజుల్లో పూర్తి చేస్తామని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ రాష్ట్రంలోనే ప్రథమంగా కొండారెడ్డిపల్లి గ్రామంలో సాంప్రదాయేతర ఇంధన వనరుల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు, కాలుష్య రహిత పర్యావరణహిత ఇంధన వినియోగం కొరకు సౌర విద్యుత్ ఉత్పత్తిని చేపట్టి వినియోగంకొరకు సౌర విద్యుత్ ఉత్పత్తిని చేపట్టి వినియోగంలోకి తీసుకొచ్చే పనులను అధికారులు అత్యంత వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గ్రామంలో సోలార్ ప్రాజెక్టుకు కావాల్సిన భూ సేకరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని వంగూరు తహసీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు. కొండారెడ్డిపల్లి గ్రామాభివృద్ధికి నోడల్ అధికారి డాక్టర్ జీ.వి.రమేష్, జిల్లా విద్యుత్ శాఖ ఎస్‌ఈ వెంకటేశ్వర్లు, డీపీఓ రాంమోహన్‌రావు, విద్యుత్ శాఖ డీఈ శ్రీధర్‌శెట్టి, విద్యుత్ శాఖ అధికారులు తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్

## 6 గ్యారెంటీల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీయాలి

**ఆత్మకూర్ సెప్టెంబర్ 24 ప్రభాతవార్త :** ఎంపీ అరుణమ్మ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరోగ్యానికి అమలుపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు కార్యకర్తలు సన్నద్ధం కావాలని మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణమ్మ పిలుపునిచ్చారు.బిజెపి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మంగళవారం రోజు ఆత్మకూరు పట్టణంలోని ఓ ప్రైవెటు ఫంక్షన్ హాల్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని రాష్ట్రంలో ప్రజల దృష్టిని మరిచేందుకు హైడ్రా పేరిట జమ్మిక్కులు చేస్తుందని ఈ విషయాన్ని కార్యకర్తలు విస్తృతంగా ప్రజల్లోకి తీసుకళ్లి ప్రభుత్వానికి వ్యతిరేకంగా విస్తృత ప్రచారం చేపట్టాలని ఆమె సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి బలపరిచిన అభ్యర్థులను గెలిపించేందుకు ప్రతి కార్యకర్తల కంకణబద్ధులై పని చేయాలని ఆమె అన్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఉచిత హామీల పేరుతో ప్రజలను మోసం చేసేందుకు నాలుగు రాష్ట్రాల్లో జరుగుతున్న ఎన్నికల్లో మోసపూరిత వాగ్దానాలను కురిపిస్తున్న విషయాన్ని కూడా ప్రజలు గమనించాలని ఆమె అన్నారు. ప్రస్తుతం నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం అగ్రగామిగా ఎదిగేందుకు అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకుంటున్నారని దేశ భద్రతే ధ్యేయంగా మోడీ పని చేస్తున్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలని సూచించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పార్లమెంటు స్థానాన్ని దక్కించుకున్నప్పటికీ అందుకు తగ్గట్టుగానే స్థానిక సంస్థలు ఎన్నికల్లో బిజెపి బలపరిచిన అభ్యర్థులను అధిక మొత్తంలో గెలిపించికొని రాబోయే కాలంలో తెలంగాణ రాష్ట్రంలో బిజెపిని అధికారంలోకి తెచ్చేందుకు ప్రతి ఒక్కరూ సంసిద్ధంగా ఉండాలని ఆమె అన్నారు. ఇప్పటికే ఆరు గ్యారెంటీల అమలు పై ప్రభుత్వం చేతులెత్తేసిందని రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తానని -మిగతా4లో..



సమావేశంలో మాట్లాడుతున్న పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణమ్మ

## కస్తూర్బా విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

**విద్యార్థినులతో కలిసి భోజనం చేసిన కలెక్టర్ సిక్తా పట్నాయక్**

**నారాయణపేట టౌన్,సెప్టెంబరు 24 ప్రభాతవార్త:**దామరగిద్ద మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయాన్ని మంగళవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ తనిఖీకి వెళ్లిన సమయంలో అక్కడ విద్యార్థులు మధ్యాహ్న భోజనానికి సిద్ధం కావడంతో మెను ప్రకారం అల్పాహారం, మధ్యాహ్న భోజనం ఇస్తున్నారా? లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించేందుకు ఆ విద్యార్థులతో పాటు కింద కూర్చొని వారితో ముచ్చటిస్తూ భోజనం చేశారు. భోజనం బాగుందని, రోజూ ఇలాగే మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని ఎస్‌ఓకు సూచించారు. అంతకు ముందు కలెక్టర్ ఆ విద్యాలయంలో పలు తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడి వసతి, సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. చదువు ఎలా సాగుతోందని - మిగతా4లో..



విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్

## చెంచుల అభ్యున్నతికి కృషి చేయాలి

**- చెంచులకు ఆధార్, రేషన్, కుల, జనన, మరణ ధృవీకరణ పత్రాలు జారీ చేయాలి: నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:**జిల్లాలో పీవీటీజీ(పర్టికులర్లీ వల్నరబుల్ ట్రైబల్ గ్రూప్స్)గా గుర్తింపబడిన చెంచులకు ప్రధానమంత్రి జన్‌మన్ కార్యక్రమం ద్వారా వసతులు కల్పించాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పీఎం జన్‌మన్‌జనజాతి ఆదివాసీ న్యాయ మహాఅభియాన్ పథకంపై పీఓఐటీడీఏ రోహిత్ గోపిడితో కలిసి సంబంధితశాఖల అధికారులతో అంశాలవారీగా సమీక్షా సమావేశాన్ని జిల్లాకలెక్టర్ నిర్వహించారు. ఇప్పటివరకు చెంచుపెంటల్లో నిర్వహించాల్సిన పనులు,నిర్వహించిన పనుపై అంశాలవారీగా అధికారులను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని 8మండలాల్లోని 88 ఆదివాసీ చెంచు పెంటల ప్రాంతాల్లో జీవిస్తున్న 8772 మంది చెంచులకు ప్రధానమంత్రి జన్‌మన్ పథకం ద్వారా 11రకాల మౌలికవసతులు అందేలా చూడాలన్నారు. చెంచు ప్రజలందరికి ఆధార్‌కార్డులను రానున్న వారం రోజుల్లో అందించాలని ఆదేశించారు. చెంచుల నివాస ప్రాంతాల్లో ఇప్పటికే మంజూరైన 890 ఇల్లు, రోడ్ల వసతి, నివాసాలకు తాగునీరు సరఫరా, మొబైల్ మెడికల్ యూనిట్లు, అంగన్‌వాడీ సెంటర్లు,అని పెంటల్లో విద్యుత్ కనెక్షన్లు పూర్తిచేయాలని ఆదేశించారు. పథకాలు అందించడంలో ఇబ్బందులు లేకుండా గుర్తింపుకార్డులు అందించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. వారంలోగా అందరికి జనన ధృవీకరణ సర్టిఫికెట్లు,ఆధార్‌కార్డులు,ఆయుష్మాన్ భారత్‌కార్డులు, కిసాన్ క్రెడిట్ కార్డులు అందించాలన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ -మిగతా4లో..



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

## ట్రస్మా రాజకీయ పక్షం కాదు..

**- ట్రస్మా గ్రూపుల్లో రాజకీయ ప్రకటనలు నిషేదం.. - ట్రస్మా జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్**

**భూత్పూర్, సెప్టెంబర్ 24, ప్రభాతవార్త :** తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ట్రస్మా) ఏ రాజకీయ పార్టీకి సంబంధం లేదని, ట్రస్మా రాజకీయ పార్టీకానే కాదని ట్రస్మా జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ స్పష్టం చేశారు. మంగళవారం లక్ష్మణ్ ఖప్రభాతవార్తగ ప్రతినిధితో మాట్లాడుతూ ఇటీవల ట్రస్మా గ్రూప్, ట్రస్మా వాట్సాప్‌లలో రాజకీయ ప్రకటనలు వస్తుండడం దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ట్రస్మా అనేది విద్యా సంబంధమైన స్వచ్ఛంద సంస్థ అని లక్ష్మణ్ పేర్కొన్నారు. ట్రస్మాలో నిష్ణాణమైన మేధావులు, ఉన్నత చదువులతో సుశిక్షితులు, అపార అనభవజ్ఞులైన విద్యాదాతలున్నారని అన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొంది తక్కువ ఫీజులతో ఎక్కువ జ్ఞానాన్ని అందించే విద్యా సంస్థలు ట్రస్మాలో సభ్యత్వం పొంది యున్నాయని పేర్కొన్నారు. ట్రస్మా గ్రూపులలో రాజకీయ ప్రకటనలు తరచూ చోటుచేసుకుంటుండడంతో ట్రస్మాపై ఒక రాజకీయ పార్టీ ముద్ర పడి ట్రస్మాను ఒక రాజ కీయ పార్టీ అనుబంధ సంస్థగా కొందరు భావిస్తుండడం సరికాదని అన్నారు. ఇకనుంచి ట్రస్మా బాధ్యులు ట్రస్మాను రాజకీయ అను బంధ విషయాలకుగాను, రాజకీయ కార్యకలాపాలకుగాను వాడుకోవడం పూర్తిగా నిషేదమని పేర్కొన్నారు. ట్రస్మానుగాని, ట్రస్మావాట్సాప్ గ్రూపులను గాని రాజకీయ విషయాలకు, ఎన్నికల ప్రచారాలకు వినియోగించడడం నిషేధిస్తున్నట్లు తెలిపారు. ట్రస్మా సంస్థ ను రాజకీయ సంబంధ విషయాలకు ఉపయోగించడం క్రమ శిక్షణా రాహిత్యం పరిధిలోకి ట్రస్మా రాష్ట్ర కమిటీ చేర్చిందని పేర్కొన్నారు. ట్రస్మా బాధ్యులు, సభ్యులు రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు నడుచుకోవాలని లక్ష్మణ్ సూచించారు.

## పీయూలో స్వచ్ఛత హీ సేవా..

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 24 ప్రభాతవార్త :** పాలమూరు యూనివర్సిటీలో యూనివర్సిటీ పిజి కాలేజీలో ఎన్ఎస్ఎస్ యూనిట్స్ 1,4,5,7లు సంయుక్తంగా ఎన్ఎస్ఎస్‌డే సెలబ్రేషన్స్, స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డా. కె. ప్రవీణ హాజరై మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల శుభ్రతను పాటించాలన్నారు.



చెత్తను తొలగిస్తున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు

1969 సెప్టెంబర్ 24న ఎన్ఎస్ఎస్ ఆవిర్భవించిందని, జాతీయ సేవా పథకం ద్వారా విద్యార్థుల్లో సేవాగుణం పెంపొందుతుందని, తద్వారా సమాజ సేవకు పూనుకుంటారని అన్నారు. ఛైర్మన్ డా. చంద్రకిరణ్ మాట్లాడుతూ జాతీయ సేవా పథకం ద్వారా వ్యక్తిత్వ వికాసం అభివృద్ధి చెందుతుందని, నాయకత్వ లక్షణాలు అలవడతాయని అన్నారు. విభాగాధిపతి డా. శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ బృంద చర్చల్లో పాల్గొనడం వల్ల అవగాహన పెరుగుతుందని, సమాజం అభివృద్ధి చెందాలంటే వ్యక్తి అభివృద్ధి చెందాలని అన్నారు. అనంతరం ప్రత్యేక శిబిరంలో పాల్గొన్న వాలంటీర్స్‌కు సర్టిఫికెట్స్ ప్రధానం చేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డా. రవికుమార్, డా. శివకుమార్‌సింగ్, జ్ఞానేశ్వర్, గాలన్న, అధ్యాపకులు రామ్మోహన్, డా. సిద్దరామగౌడ్, డా. రామరాజు, చైతన్య, సత్యం, రఘు, గాయత్రి, నాగమణి వాలంటీర్స్ పాల్గొన్నారు

## రోడ్డు పక్కన ఉన్న వైన్స్‌ను తరలించాలని ధర్నా

**అమరచింత సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:** అమరచింత మున్సిపల్ శివారులోని రోడ్డు పక్కల ఉన్న వైన్ షాప్‌ను తరలించాలని డిమాండు చేస్తూ కేవీపీఎస్ ఆధ్వ ర్యంలో మంగళవారం తాహసిల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు శ్యాంసుందర్ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ అజయ్ మాట్లాడుతూ అమర చింత పట్టణంలోని ప్రధాన రహ దారి పైన వైన్ షాప్ ఉండడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని వెంటనే ఎక్సైజ్ అధికారులు వైన్ షాపును తరలించాలని వారు అధికారులను కోరారు. అనేకమార్లు వైన్ షాపును తరలించాలని అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదని ఇప్పటికైనా అధికారులు స్పందించి వైన్ షాపునుమరో స్థలానికి తరలించాలని లేనిచో కెవిపిఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండల నాయకులువిజయ్ అరుణ్ కుమార్, వినోద్, నేపాల్ మహమూద్ , యుగంధర్ తదితరులు ఉన్నారు.

## శుద్ధ జలాన్ని ప్రజలకు అందించాలి

**కొత్తకోట సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:** పట్టణ మండల ప్రజలకు పరిశుభ్రమైన నీటిని అందించాలని మార్కెట్ కమిటీచైర్మన్ పల్లెపాగు ప్రశాంత్ అన్నారు. మంగళవారం కొత్తకోట మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ మంచినీటి సహాయకుల శిక్షణశిబిరం కార్యక్రమం నిర్వహించారు. మిషన్ భగీరథ మంచినీటి పథకం గురించి అధికారులతో చర్చించి తగుసూచనలు సలహాలు చేశారు. కొత్తకోట మండలంలోని అన్ని గ్రామాలలో, కొత్తకోట పట్టణంలో మిషన్‌భగీరథ నల్లాలు ఏవైతే ఉన్నాయో వాటిలో నల్లాలు ఊడిపోయి అస్తవ్యస్తంగా ఉండటం వల్ల తాగునీరు కొన్ని ఏరియాల్లో వృధాగా పడి ఉన్నాయని గుర్తించి మరమ్మత్తులు చేపట్టాలని చర్చించారు. ఈఈ అధికారి వీటిపై శ్రద్ధ వహించి వీటిని సరిచేయాలని సకాలంలో శుద్ధమైన నీటిని ప్రజలకు అందించాలని అధికారులకు కోరారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి, మాజీ సీడీసీ చైర్మన్ పి.చంద్రశేఖర్ రెడ్డి, పాపయ్య, కృష్ణారెడ్డి, పాపయ్య మోహన్ రెడ్డి, చర్లపల్లి మాజీ సర్పంచు శేఖర్ రెడ్డి, మాసన్న, యన్ఎస్‌యుఐ పట్టణ అధ్యక్షులు వలుగు మాన్ శ్యామ్, మాజీ సర్పంచు అరుణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పీఆర్‌టీయూ టీఎస్ నూతన కమిటీకి మండల ఉపాధ్యాయుల సన్మానం..

**భూత్పూర్, సెప్టెంబర్ 24, ప్రభాతవార్త :** పీఆర్‌టీయూ టీఎస్ నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఇతర కమిటీ సభ్యుల్ని మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భోజన విరామ సమయంలో మండల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కమిటీ నూతన అధ్యక్షుడు సత్తూర్ బాల్‌రాజ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి పి కృష్ణయ్య, కార్య దర్శి అంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షుడు నరేందర్‌లను మండల ఉపాధ్యాయులు పూలమాలలు,



శాలువలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంపెక్స్ ప్రధానోపాధ్యా యురాలు ఆనందమ్మ, వెల్కిచర్ల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లావణ్య, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, భూత్పూర్ స్కూల్ కాంప్లెక్స్ కార్యదర్శి కొప్పోలు యాదయ్యతో పాటు ఇతర ఉపాధ్యాయులు రాంబబు, దస్తయ్య, శశిధర్, శివశంకర్, నారాయణమ్మ, బాలాజీ, సునీత, రేఖ, రాణి, యశోద, రాఘవేందర్, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

**అమరచింత సెప్టెంబర్ 24 ప్రభాతవార్త :** ప్రతి గ్రామంలో స్వచ్ఛందంగా ఆయా గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని మఖ్తల్ ఎమ్మెల్యే, వాకిటి శ్రీహరి అన్నారు. మంగళ వారం అమరచింత మండలంలోని నాగల్ కడుమూర్ గ్రామంలో ప్రజలు స్వచ్ఛందంగా ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలను మఖ్తల్ ఎమ్మెల్యే వాకిటిశ్రీహరి పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కేశం నాగరాజుగౌడ్ ప్రత్యేక



పూజ లు నిర్వహించి ప్రారంభించారు. ఆయా గ్రా మాల ప్రజలు నాగల్ కబుమూర్ గ్రామ ప్రజలను ఆదర్శంగా తీసుకోని స్వచ్ఛందంగా గ్రామంలో 16 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని ఆయన గ్రామ ప్రజలను అభినందించారు. గ్రామలలో ఎలాంటి సంఘటనలు జరిగిన గుర్తించడానికి సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగప డతాయన్నారు. ప్రతిగ్రామాలలో పోలీసులు ప్రజలను యువకులను వ్యాపారస్తులకు సీసీ కెమెరాల పై అవగాహన కల్పిస్తున్న ఆత్మకూర్ సిఐ శికుమార్, అమరచింత ఎస్సై, బండారి నరేష్‌ను ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కేశం నాగరాజు గౌడ్ పూలమాల శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాగల్ కడుమూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు అధికారులు పాల్గొన్నారు.

## మండల పంచాయతీ కార్యదర్శుల అధ్యక్షురాలిగా బాలీశ్వరి

**గద్వాల , సెప్టెంబర్ 24 ప్రభాతవార్త :** గద్వాల మండల పంచాయతీ కార్యదర్శుల అధ్యక్షురాలిగా పుటాన్ పల్లి గ్రామం కార్యదర్శి బాలీశ్వరిని ఎన్నుకున్నారు. మండల పరిధిలో పనిచేస్తున్న 28 గ్రామపంచాయతీల పంచాయతీ కార్యదర్శుల మండల కమిటీ కార్యవర్గాన్ని మండల పరిషత్ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షురాలిగా బాళీశ్వరి, ప్రదాన కార్యదర్శిగా మేళ్ల చెర్వుగ కార్యదగర్శిగ రుభియాబీ, కోశాధికారిగా పాండును ఎన్నుకున్నారు. జిల్లా నాయకులు వెంకట నారాయణ రామ నర్సింహులు, ఖాజమీర్ సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. మండల పంచాయి కార్యదర్శుల కార్యవర్గ ఏర్పాటుకు జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షులు ఖాజమీర్, జిల్లా కార్యవర్గ సభ్యులు రామ్ నరసింహులు, మస్తాన్. హాజరయ్యారు. సందర్భంగా గ్రామాలలో పంచాయతీలలో చేపట్టే పనులకు బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నామని తమ సొంత ఖర్చులు చేస్తున్నామని గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరయ్యేలా చూడాలని కొందరు పంచాయతీ కార్యదర్శులు నాయకుల దృష్టికి తెచ్చారు.

# ఘనంగా పెబ్బేరు మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం

**చైర్మన్‌గా ప్రమోదిని , వైస్ చైర్మన్‌గా విజయవర్ధన్ రెడ్డి**

**బాధ్యతలు స్వీకరించిన చైర్మన్ గౌని ప్రమోదిని రెడ్డి**

**పెబ్బేరుకు కాపలాదారుడుగా పనిచేస్తా**

**సంతస్థలానికి త్వరలోనే కంపౌండ్ ఏర్పాటు చేస్తాం**

**రుణమాఫీ పై మాట్లాడే నైతిక హక్కు బిఆర్ఎస్ నాయకులకు లేదు**

**పెబ్బేరు మార్కెట్ యార్డును అన్ని రకాలుగా అభివృద్ధి చేసుకుందాం.**

**ముఖ్య అతిథిగా పాల్గొన్న వనపర్తి ఎమ్మెల్యే తూడిమెగా రెడ్డి..**



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన చైర్మన్ వైస్ చైర్మన్



బాధ్యతలు స్వీకరిస్తున్న చైర్మన్ ప్రమోదిన రెడ్డి

**పెబ్బేర్ సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:** పెబ్బేర్ పట్టణంలో మంగళవారం రోజు పెబ్బేర్ మార్కెట్ కమిటీ ప్రయాణ స్వీకారం చాలా బ్రహ్మాండంగా కళాకారులు, డబ్బులు తప్పట్లతో, బాణాసందా కలుస్తూ ఘనంగా ప్రయాణస్వీకారం జరిగింది. జిల్లా అధికారి స్వరణ్ సింగ్ చైర్మన్ ప్రమోదిని రెడ్డి, వైస్ చైర్మన్ విజయ్ వర్ధన్ రెడ్డి, డైరెక్టర్లకు ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రయాణస్వీకరాం అనంతరం ఎమ్మెల్యే పుష్పగుచ్ఛమిచ్చి కమిటిని సన్మానం చేసి సత్కరించారు. పెబ్బేర్ మార్కెట్ యార్డ్ ను జిల్లాలో ముందు వరుసలో నేర్పాలని వారికి సూచించారు. ఇంతగా అభిమానం చూపే పెబ్బేరు మండల ప్రజలకు గుండెల్లో పెట్టి చూసుకుంటా. పెబ్బేర్ వ్యవసాయ మార్కెట్ యార్డ్ నూతన కమిటీ ప్రయాణ స్వీకార కార్యక్రమంలో వనపర్తి ఎమ్మెల్యే మేఘరెడ్డి తనపై ఇంత అభిమానం చూపి వనపర్తి ఎమ్మెల్యేగా గెలిపించిన నియోజకవర్గ ప్రజలందరికీ కాపలాదారుడుగా ఉండి పనిచేస్తున్న వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వ్యవసాయ మార్కెట్ యార్డ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై అధ్యక్ష ఉపాధ్యక్షులతో పాటు డైరెక్టర్లు అందరినీ సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా పెబ్బేర్ పట్టణానికి వచ్చిన ఎమ్మెల్యేకు మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు ప్రజాప్రతినిధులు డప్పు వాయిద్యాల మధ్యన బాణాసందా కాల్చుతూ ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పెబ్బేర్ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డును అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు తాను ఎల్లవేళలా కృషి చేస్తానని నూతనంగా ఎన్నికనై మార్కెట్ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. కబ్జాకు గురైన పెబ్బేర్ సంత స్థలానికి తాను కావలదారుడుగా ఉండి 30 ఎకరాల 22 కుంటలకు దగ్గరుండి కంపౌండ్ వాల్ ఏర్పాటు చేయిస్తారని ఆయన అన్నారు. రైతు రుణమాఫీ పై మాట్లాడి నైతిక హక్కు బిఆర్ఎస్ పార్టీ నాయకులకు లేదని లక్ష రుణమాఫీ చేస్తామని విడతల వారీగా అన్నదాతలను ఎన్నో ఇబ్బందులకు గురిచేసిన ఏకైక ప్రభుత్వం బిఆర్ఎస్ ప్రభుత్వమని ఎమ్మెల్యే విమర్శించారు. రైతు భీమా రైతు భరోసా పథకాలను పక్కాగా అమలు చేసి రైతు శ్రేయస్సు ప్రభుత్వ శ్రేయస్సుగా నిలిపేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం అహర్నిశలు కృషిచేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. 2014 లో తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అప్పుడు గెలుపొందిన బిఆర్ఎస్ పార్టీకి 69 వేల కోట్లు అప్పు చూయిస్తే కేవలం 10 సంవత్సరాలలో బిఆర్ఎస్ పార్టీ ఆరు లక్షల 80 వేల కోట్ల రూపాయలను అప్పుగా చూపించి రాష్ట్రాన్ని దివాలా తీయించిన ఏకైక పార్టీ బిఆర్ఎస్ అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రానున్న గాంధీ జయంతి నుంచి రాష్ట్రంలోని ప్రజలందరికీ డిజిటల్ రేషన్ కార్డుతో పాటు ఆరోగ్య శ్రీ కార్డు సైతం ఉంటుందని ఆయన వివరించారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అందించే తొమ్మిది రకాల రేషన్ సరుకులను అందించునున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. కొంతమంది బిఆర్ఎస్ నాయకులు పని లేక పాత పనులకు శంకుస్థాపనలు చేస్తున్నారని విమర్శిస్తున్నారని 2009 లో ప్రారంభించిన కల్వకుర్తి ఎత్తిపోతులకు అక్కడక్కడ బొక్కలు పెట్టి తామే సాగు నిరంధించచామనని ప్రగల్బాలు పలికే వీరు సమాధానం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. ఇండ్లు లేని ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు అర్హతలైన ప్రతి ఒక్కరికి పెన్షన్లు త్వరలోనే అందుతాయని ఎమ్మెల్యే తెలిపారు.

పెబ్బేర్ పట్టణంలోని ప్రతి వార్డును అన్ని విధాల బాగు చేస్తామని పెబ్బేర్ ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఎల్లవేళలా ఆదరరించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పెబ్బేర్ మార్కెట్ సెక్రటరీ అనిల్ కుమార్. జిల్లా అధికారి స్వరన్ సింగ్, మున్సిపల్ చైర్మన్ జగన్నాథం నాయుడు జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు కార్పాకుల వెంకట్ రాములు, మాజీ సర్పంచులు వెంకటేష్ సాగర్, సురేందర్ గౌడ్, రవీందర్ నాయుడు, పెబ్బేర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, దయాకర్ రెడ్డి, భాను ప్రకాష్ రెడ్డి, యుగంధర్ రెడ్డి, సర్వేశ్, రాముడు, శివ, శ్రీహరి రాజు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పిడిఎస్‌యూ చరిత్రంతా పోరాటమే..

**విద్యార్థి చైతన్యంలో పిడిఎస్‌యూ కీలకపాత్ర**

**పిడిఎస్‌యూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మాజీ అధ్యక్షుడు ఎం.కాలేశ్వర్**



ర్యాలీ నిర్వహిస్తున్న పిడిఎస్‌యు నాయకులు, విద్యార్థులు

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 24 ప్రభాతవార్త :** విద్యార్థులను సామాజిక రాజకీయంగా పురోభివృద్ధి వైపు చైతన్యవంతం చేయడంలో పిడిఎస్‌యు 50 ఏళ్ల కాలంలో కీలకపాత్ర వహించిందని పిడిఎస్‌యూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మాజీ అధ్యక్షులు ఎం. కాలేశ్వర్ ఉద్ఘాటించారు. పిడిఎస్‌యు ఏర్పడి 50 ఏళ్లు అవుతున్న సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో పిడిఎస్‌యు పూర్వ విద్యార్థులు ప్రస్తుత పిడిఎస్‌యు నాయకత్వం ఆధ్వర్యంలో ఆర్అండ్‌బి అతిథి గృహం నుండి విజన్ కన్వెన్షన్ హాల్ వరకు విద్యార్థి మహా ప్రదర్శన అనంతరం జరిగిన సభకు పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు మారుతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం. కాలేశ్వర్, పి.అరుణ్‌కుమార్, పిడిఎస్‌యు మాజీ జిల్లా అధ్యక్షులు, సిహెచ్ రాంచందర్, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి బి.రాము, ఏఐపికెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాట్లాడుతూ దోపిడీ వర్గానికి సహాయపడుతూ కులం, మతం, స్త్రీ, పురుష అసమానతలను నిరంతరం కాపాడుతున్న విద్యా వ్యవస్థ అశాస్త్రీయమైనదని దీనిని వ్యతిరేకిస్తూ, శ్రామిక వర్గానికి ఉపయోగపడే సైన్స్‌ను ముందుకు తీసుకెళ్లే శాస్త్రీయ విద్యా విధానం కావాలని పోరాడుతున్నదని అన్నారు. పిడిఎస్‌యు నాయకులు జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర్ ప్రసాద్, చేరాలు, కోల శంకర్, శ్రీపాద శ్రీహరి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాధ్యతలు నిర్వహించిన సిహెచ్ వెంకటేష్ అమరులయ్యారని అన్నారు. వీరి బాటలో పిడిఎస్‌యు నిరంతరం ప్రయాణిస్తుందని నేటి ప్రతి విద్యార్థి పిడిఎస్‌యూలో పయనించాలని అన్నారు. సభలో పిడిఎస్‌యూ మాజీ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, దేవేందర్, అంబదాస్, బోయిన్‌పల్లి రాము, గణేష్, వెంకటేష్, శరణప్ప, వెంకట్, టి. విజయ, చంద్రాములు, గణేష్ జీవన్, ఐఎఫ్‌టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి సి.వెంకటేష్, పిడిఎస్‌యు ప్రధాన కార్యదర్శి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శి సాయికుమార్, రాష్ట్ర నాయకులు హరీష్ ప్రసంగించారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు నాయకులు మధు, సంజీవ్, శివకుమార్, శ్రీకాంత్, హర్షవర్ధన్‌లతో పాటు బాలు, జీవన్, రాజు, శివతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# మన్యంకొండలో ఘనంగా వీరభద్రస్వామి అగ్నిగుండం

**- అగ్నిగుండంలో నడిచి భక్తిని చాటుకొన్న భక్తులు.. - ముగిసిన వీరభద్రస్వామి ఉత్సవాలు**

**దేవరకద్ర, సెప్టెంబరు 24 ప్రభాతవార్త:** మన్యంకొండ అనుబంద దేవాలయమైన శ్రీ వీరభద్ర స్వామి అగ్నిగుండం కార్యక్రమాన్ని మంగళవారం తెల్లవారుజామున అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామి వారి ఉత్సవాలు సోమవారం రాత్రి ప్రారంభమయ్యాయి. ప్రతి ఏడాది మన్యంకొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వస్వామి క్షేత్ర పాలకుడైన వీరభద్రస్వామి వారి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో బాగంగానే ఈ ఏడాది కూడ స్వామివారి ఉత్సవాలను సాంప్రదాయరీతిలో నిర్వహించారు. అందులో భాగంగానే ఉత్సవాలలోని ప్రధానఘట్టమైన అగ్నిగుండాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి అగ్నిగుండంలో నడచి భక్తులు తమ భక్తిని చాటుకొన్నారు. అలాగే స్వామివారికి వివిధ అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మెన్ అళహరి మధుసూధన్‌కుమార్, అళహరి రాయకృష్ణ, ఈఓ శ్రీనివాసరాజు, పూజారుల అధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుండి భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు. వివిధ ప్రాంతాలనుండి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని తరించారు. ఈ సందర్భంగా మన్యంకొండ వీరభద్రస్వామి దేవస్తానాన్ని రంగురంగుల విద్యుత్ బల్బులతో శోభాయమానంగా అలంకరించారు.



మన్యంకొండలో అగ్నిగుండంలో నడుస్తున్న భక్తుడు

# మహిళా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం..

**లబ్ధిదారులకు మహాలక్ష్మి ధృవపత్రాలు అందజేత**

**చిన్నచింతకుంట, సెప్టెంబరు 24 ప్రభాతవార్త :** రాష్ట్రంలోని మహిళల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని అప్పంపల్లి, ముచ్చింతల సింగిల్ విండో ఛైర్మన్లు సురెందర్‌రెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డిలు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఫంక్షన్ హాల్‌లో మహాలక్ష్మి పథకం కింద రూ.500లకే అందజేస్తున్న ధృవపత్రాలను ఆయా గ్రామాల లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలలో ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్య శ్రీ పథకం కింద పది లక్షల వరకు ఉచిత వైద్యం, 200ల యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, అదే విధంగా మహాలక్ష్మి పథకం కింద సబ్సిడిపై రూ. 500లకే సిలిండర్ అందజేస్తున్నామని వారు తెలిపారు. ప్రజలకు ఇచ్చి న హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తుచ తప్పకుండా అమలు చేస్తుందని వారు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నరెందర్‌రెడ్డి అన్నారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ పూర్తి స్థాయిలో అమలు చేశామని రైతు సంక్షేమ ధ్యేయంగా పనిచేసే ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ కన్వీనర్ ఎస్. వెంకటేష్ అన్నారు. అనంతరం ఆయా గ్రామాలకు చెందిన మహాలక్ష్మి పథక లబ్దిదారులకు దృశపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో తహసిల్దార్ కృష్ణయ్య, ఎంపిడిఓ సుధాకర్‌రెడ్డి, ఎంపిఓ అనిల్‌కుమార్, ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, లబ్దిదారులు పాల్గొన్నారు.



మహిళలకు ధృవపత్రాలు అందజేస్తున్న దృశ్యం

# మిషన్ భగీరథ ద్వారా శుద్ధజలాన్ని సరఫరా చేయాలి

**లింగాల, సెప్టెంబరు 24 ప్రభాతవార్త :** గ్రామాల్లో ప్రజలకు శుద్ధజలాన్ని సరఫరా చేసి ఆరోగ్యాలను కాపాడాలని మిషన్ భగీరథ ఈఈ శ్రీధర్‌రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో గ్రామ మంచినీటి సహాయకుల శిక్షణ కార్యక్రమానికి వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ ఈఈ శ్రీధర్‌రావు మాట్లాడుతూ గ్రామ మంచినీటి సహాయకులకు రాష్ట్ర వ్యాప్తంగా మంచినీటి సహాయకులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయని తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో నాలుగు మండలాల్లో శిక్షణ కార్యక్రమాలు జరుగుతున్నాయని అన్నారు. గ్రామ సహాయకులకు నాలుగు రోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ పూర్తి చేసుకుని గ్రామాల్లో మిషన్ భగీరథ ద్వారా ప్రజలకు అందిస్తున్న త్రాగునీటి పట్ల అశ్రద్ధ వహించరాదని, పైప్‌లైన్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి లీకేజీ ఉన్న చోట్ల మరమ్మతులు చేసి మంచినీటిని సరఫరా అందించేటట్లు చూడాలన్నారు. గతంలో ప్రజలు చెరువులోని నీళ్లు త్రాగి కలరా, మలేరియా, టైఫాయిడ్ వంటి రోగాలు వచ్చి తీవ్ర ఇబ్బందులు పడేవారని, మిషన్ భగీరథ నీళ్లు రావడం వల్ల అటువంటి రోగాలు తక్కువగా కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈఈ సుధాకర్‌సింగ్, డీఈ హేమలత, ఏఈ బాలరాం నాయక్ పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న మిషన్ భగీరథ ఈఈ శ్రీధర్‌రావు

## నేడు ముగ్గురు మంత్రులు గద్వాలకు రాక

**గద్వాల, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:** గద్వాల నియోజకవర్గం గట్టు మండల పరిధిలో కొనసాగుతున్న నల్ల సోమనాద్రి రిజర్వాయర్ గట్టు లిఫ్ట్, ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను పరిశీలించేందుకు బుధవారం రాష్ట్ర మంత్రులు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తంకుమార్ రెడ్డి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, దామోదర రాజనర్సింహ, అబ్కారి పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు లు పర్యటించనున్నారు.

## చికిత్స పొందుతున్న వ్యక్తిని పరామర్శించిన ఎమ్మెల్యే



బాధితుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

**వెల్దండ, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:** మండలంలోని భైరాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు తలారి నర్సింహ్మ అల్లుడు గడ్డం మల్లేష్ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓవైసీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి గడ్డం మల్లేష్‌ను పరామర్శించి యోగా క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఎమ్మెల్యే వెంట నర్సింహ్మ తదితరులు ఉన్నారు.

## తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరు అలాగే ఉంచాలి

**ఆర్య వైశ్య సంఘం కోశాధికారి రాంమోహన్ వెల్లడి**

**గద్వాల, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త :** ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణ త్యాగం చేయడంతో పాటు దేశ స్వతంత్ర పోరాటంలో తనదైన పాత్ర పోషించి తెలుగు భాషాభిమానుల అవమానం చూరగొన్న దివంగ పొట్టి శ్రీరాములు పేరును తెలుగు విశ్వవిద్యాలయం నుండి తొలగించడం బాధాకరమని, ప్రభుత్వం పునరాలోచన చేసి యూనివర్సిటీకి శ్రీరాములు పేరును ఉంచాలని జోగులాంబ గద్వాల జిల్లా ఆర్యవైశ్య మహసభ కోశాధికారి గద్వాల జిల్లా ఆర్యవైశ్య మహసభ కోశాధికారి రాంమోహన్ శెట్టి ప్రభుత్వాన్ని కోరారు. రాంమోహన్ మాట్లాడుతూ ప్రభుత్వం పొట్టి శ్రీరాములు పేరును తొలగించకుండా చూడాలన్నారు. సురవరం ప్రతాప్‌రెడ్డి పేరును మరో వ్యవస్థకు పెడితే బాగుంటుందన్నారు. తెలుగు రాష్ట్రాల అభిమానం, స్వతంత్ర సమరయోధుల మన్ననలను అందుకున్న గొప్ప వ్యక్తి పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ప్రభుత్వం ఆర్యవైశ్యుల కొరికను మన్నించి యథాతత స్థితి కొనిసాగించాలన్నారు.

## స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్న న్యాయమూర్తులు..



కోర్టు ఆవరణలో పరిసరాలను శుభ్రం చేస్తున్న న్యాయ మూర్తులు

**గద్వాల, సెప్టెంబర్ 23 ప్రభాతవార్త:** హైకోర్టు వారి ఆదేశానుసారం సోమవారం సాయంత్రం గద్వాల కోర్టు ఆవరణలో స్వభావ్ స్వచ్ఛత సంస్కార్ స్వచ్ఛత కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా న్యాయమూర్తులు, కోర్టు సిబ్బంది కోర్టు పరిసరాలను ఊడ్చి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తి కుష మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఆరోగ్యంగా ఉంటారని ఉన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. అదే విధంగా స్వచ్ఛత గురించి ప్రజలకు వివరించాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు పర్యావరణం, పరిశుభ్రతలను వివరించే ప్లే కార్డులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయమూర్తి కుష, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి నేరెళ్ల హేమ పూజిత అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఉదయ్ నాయక్, జిల్లా కోర్టు ఏఓ శ్రీనివాస్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామ మంచినీటి సహాయకుల శిక్షణ కార్యక్రమం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

**మక్తల్ టౌన్,సెప్టెంబరు 24 ప్రభాతవార్త:** మక్తల్ మండల పరిషత్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసిన గ్రామ మంచినీటి సరఫరా సహాయకులకు శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో మంచినీటి సరఫరా విషయంలో ఎలాంటి తప్పిదాలు జరగొద్దని కోరారు. మంచినీటి సరఫరా విషయంలో ఏమైనా సమస్యలు ఉంటే వ్రాసి పెట్టుకొని తిరిగి నాలుగవ రోజు జరిగే శిక్షణ కార్యక్రమానికి నేను వచ్చినప్పుడు నా దృష్టికి తీసుకురావాలని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతి ఇంటికి మంచి నీటిని అందించడం కోసం పోయిన ఈ వేసవి కాలంలో దాదాపు రూ. 2 కోట్లతో ప్రతి గ్రామానికి నీటిని అందించే విధంగా చర్యలు తీసుకుందని తెలిపారు.

## తహసీల్దార్‌కు స్వాగతం పలికిన బీరల్లి గ్రామస్తులు



**గద్వాల సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:** గద్వాల మండల తహసిల్దార్ కార్యాలయానికి కొత్తగా వచ్చి బాధ్య తలు చేపట్టిన తాహసీల్దార్ మల్లికార్జున్‌కు బీరల్లి గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. మంగళ వారం తాహసిల్దార్ కార్యాలయంలో తాహసిల్దార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా బీరల్లి గ్రామ సమస్యలను తాహసిల్దార్ కు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీరల్లి గ్రామ పెద్దలు, కాంగ్రెస్ నాయకులు రమేశ్ నాయుడు, మాజీ యంపిటిసి గౌని రాధాకృష్ణ రెడ్డి, మాజీ సర్పంచు నీలేశ్‌రెడ్డి,సింగిల్ విండోడైరెక్టర్‌నరేష్ కుమార్‌రెడ్డి,రవీందర్‌రెడ్డి,తూర్కొనిపల్లి అగ్గిరాముడు పాల్గొన్నారు.

## స్పాట్ మీటర్ రిడర్స్ ఆర్థిక సహాయం అందజేత



ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

**మక్తల్ టౌన్,సెప్టెంబరు24 ప్రభాతవార్త:** మక్తల్ సెక్షన్ పరిధిలో స్పాట్ బిల్లర్‌గా విధులు నిర్వహిస్తున్న అంబ్రెస్ సోమ వారం అనారోగ్య కారణాల వల్ల మృతి చెందారు. రాష్ట్ర మీటర్ రీడర్స్ అందరు కలిసి రూ.20.700ల ఆర్థిక సహాయాన్ని అంబ్రెష్ భార్య, కుమారుని సమక్షంలో వారికి అందజేశారు. భవి ష్యత్‌లో మీ కుటుంబానికి మీటర్ రీడర్స్ అన్ని వేళలా చేయూతని అందించడానికి ముందుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మక్తల్ మీటర్ రీడర్స్ రాము రాకేష్, ఆనంద్, తమ్మప్ప, బలరాం, అనిల్,సతీష్, అసన్ పాషాలు పాల్గొన్నారు.

## ఒకే కాన్పులో రెండు దూడలకు జన్మనిచ్చిన గేదె



**ఉప్పునుంతల,సెప్టెంబరు24 ప్రభాతవార్త:** ఒకే కాన్పులో రెండు దూడలకు గేదె జన్మనిచ్చిన సంఘటన చోటు చేసుకుంది. మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన మాడుగుల మల్లేష్ గేదె మంగళవారం రెండు దూడలకు జన్మనిచ్చింది. ఈ విచిత్ర ఘటన గ్రామస్తులందరిని ఆశ్చర్యానికి గురి చేసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా గేదె రెండు దూడలకు జన్మనివ్వడం ఈ ప్రాంతంలో ఇదే మొదటిసారి అని గ్రామస్తులు తెలిపారు. చిత్ర ఘటనను కనులారా వీక్షించడానికి గ్రామ ప్రజలు తరలివెళ్తున్నారు. ఇదిలా ఉండగా జన్మనిచ్చిన గేదె దూడలు క్షేమంగా ఉండడంతో గేదె యజమాని మల్లేష్ సంతోషం వ్యక్తం చేస్తున్నాడు.

## పూర్వ విఆర్ఏలకు న్యాయం చేయాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

**కృష్ణ,సెప్టెంబరు 24 ప్రభాతవార్త:** గత ప్రభుత్వం విఆర్ఎల సర్దుబాటు కోసం ఇచ్చిన 81 వలన 55 నుండి 61 మధ్య వయస్సు గల పూర్వ విఆర్ఎలకు అన్యాయం జరిగిందని స్పందించి న్యాయం చేయాలని పూర్వ గ్రామ రెవెన్యూ సహాయకుల హక్కుల పోరాట సమితి తహసిల్దార్ నాగేంద్రప్రసాద్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం విఆర్ఏల సర్దుబాటు కోసం ఇచ్చిన జిఓ 81,85,98ల వలన ప్రమోషన్ పొంది 55 నుండి 61 మధ్య వయసు గల విఆర్ఎల కుటుంబాలు తెలంగాణ రాష్ట్రంలో దాదాపుగా 2500 దళిత కుటుంబాలు రోడ్డున పడ్డా యని, తక్కువ సర్వీస్ చేసి ఎలాంటి ఆర్థిక ప్రయోజనం లేకుండానే పదవి విరమణ పొందుతూ ఉన్న ఒక్క ఆర్థిక వనరు కోల్పోయి కుటుంబ పోషణ భారంగా మారిందని తినడానికి తిండి లేక రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. వినతి పత్రం సమర్పించిన వారిలో అయినాపూర్ సాయిబన్న, లక్ష్మణ, ఆనంపల్లి సాయిబన్న ఉన్నారు.

## సమాచార హక్కు చట్టం కరపత్రాలు విడుదల



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

**కృష్ణ,సెప్టెంబరు24 ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలో సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎలిగండ్ల వెంకటేష్ ముది రాజ్, జిల్లా అధ్యక్షులు ఏర్పుల నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు పతంగి చిన్నయ్యల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో సెప్టెంబర్ 30న నిర్వహించబోయే సమాచార హక్కు చట్టం 2005 అవగాహన సదస్సుకు సంబంధించిన కరపత్రాలనువిడుదల చేశారు.కార్యక్రమంలో ఉమ్మడి అసెంబ్లీ ఇంఛార్జి పి.రాజు,జిల్లా సభ్యులు గజలప్ప, సందకృష్ణ, నారాయణపేట ఇంఛార్జి ఎడ్ల కుర్మయ్య, మక్తల్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సునిల్ యాదవ్, పేట అసెంబ్లీ అధ్యక్షులు గణేష్, కృష్ణ మండల అధ్యక్షుడు జి. సందప్ప, మద్దూరు మండల అధ్యక్షుడు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## అడ్డాకుల మండల విద్యార్థి రాష్ట్రస్థాయికి ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు అభినందిస్తున్న దృశ్యం

**అడ్డాకుల,సెప్టెంబరు 24ప్రభాతవార్త:** అడ్డాకుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అడ్డాకులకు చెందిన విద్యార్థి కె. అర్చన రాష్ట్రస్థాయి డ్రాయింగ్ పోటీలకు ఎంపికైంది. జిల్లాలోని మెట్టుగడ్డలోని ఆర్వీఎం సమావేశ మందిరంలో విద్యాశాఖ, వైద్యారోగ్య శాఖలు సంయుక్తంగా హెచ్ఐవి నివారణ చర్యలపై సోమ వారం వివిధ పోటీలు నిర్వహించగా ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 8,9 తరగతులకు చెందిన 83 మంది విద్యార్థులు పోటీలలో పాల్గొన్నారు. ఈ పోటీలలో విజేతలుగా ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. విజేతలుగా ఎంపికైన గీతిక, రాజాపూర్ కెజిబివి, అర్చన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అడ్డాకులకు చెందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెమెంటోస్‌లను ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు అందించారు.ఈ విద్యార్థులు 28వ రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్ తెలిపారు.

## మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి చేస్తాం

### మార్కెట్ యార్డు చైర్మన్ దొడ్డెప్ప, వైస్ చైర్మన్ కుమార్

**ఇటిక్యాల సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:** అలంపూర్ మార్కెట్ యార్డు లో మంగళవారం మార్కెట్ యార్డు చైర్మన్ దొడ్డప్ప వైస్ చైర్మన్ కుమార్ అధ్యక్షతన కమిటీ సమావేశం నిర్వహించారు. అలంపూర్ మార్కెట్ యార్డు అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలు రైతుల ఆదుకోవాల్సిన తీరుపై వివిధ అంశాల పై చర్చించారు.ఈ సమావేశంలో ఐజ సబ్ మార్కెట్ యార్డ్‌ను మార్కెట్ యార్డ్ ను అప్ గ్రేడు చేసి సబ్ మార్కెట్ యార్డ్‌గా చేయాలని అలంపూర్ చౌరస్తాలో ఉన్న ప్రస్తుత మార్కెట్ యార్డ్‌ను ఆధునికరించి, రైతులకు ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దాలని చర్చించారు. ఈ సమావేశంలో మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు, మార్కెట్ యార్డ్ సెక్రటరీ సిబ్బంది పాల్గొన్నారు.



మార్కెట్‌ను సబ్ మార్కెట్‌గా చేయాలని చైర్మన్‌కు వినతిపత్రం ఇచ్చిన ఐజ కాంగ్రెస్ నాయకులు

## ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే

**రోగులకు చికిత్స అందించడంలో ఎలాంటి జాప్యం జరగకూడదు : ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి**



ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

**మక్తల్ టౌన్,సెప్టెంబరు24 ప్రభాతవార్త:** పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వవారు అక్కడి ఉద్యోగులను ఆసుపత్రిలో జరుగుతున్న ప్రసవాలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఒక్కో నెలలో దాదాపుగా ఎన్ని ప్రసవాలు ఆసుపత్రిలో జరుగుతున్నాయి, ఎంతమంది గర్భిణీలను ప్రసవాల కొరకు జిల్లా ఆసుపత్రికి పంపి స్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగులకు సమయానికి ఆసుపత్రిలో ఉంటున్నారా, 24 గంటలు ప్రజలకు సేవలను అంది స్తున్నారా అని పలు అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. సమయానికి ఆసుపత్రికి రాని ఉద్యోగులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉద్యోగుల హాజరును పరిశీలించారు. ఒక ఉద్యోగి పని సమయం అయిపోయినా ఇంకో ఉద్యోగి వచ్చి విధుల్లో చేరే వరకు విధుల్లోంచి వెళ్లొద్దని కోరారు. ప్రభుత్వం తరపున స్థానిక ఎమ్మెల్యేగా నా వంతు కృషి తప్పకుండా ఆసుపత్రి అభివృద్ధిపై ఉంటుందని అన్నారు. పని చేస్తున్న ఉద్యోగులకు ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. రోగులకు చికిత్స అందించడంలో ఎలాంటి జాప్యం జరగకూడదని సూచించారు. ఆసుపత్రికి ఇంకా కావాల్సిన పరికరాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటిసి లక్ష్మారెడ్డి, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## న్యాస్ పరీక్షకు విద్యార్థులను సిద్ధం చేయాలి



మొక్కలు నాటుతున్న కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు

**తెల్కపల్లి,సెప్టెంబరు 24 ప్రభాతవార్త:** డిసెంబర్ నెలలో నిర్వహించే న్యాస్ పరీక్షలో ఉత్తమ ఫలితాలను సాధించేందుకు విద్యార్థులను సంసిద్ధం చేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా సెక్టోరల్ అధికారి షర్ఫుద్దిన్ అన్నారు. మంగళవవారం మండల పరిధిలోని గౌరెడ్డిపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఆంగ్ల పాఠశాల సముదాయ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులలో ఆంగ్ల పదజాల నైపుణ్యాన్ని పెంపొందించాలని అన్ని పాఠశాలల్లో లిప్ ప్రోగ్రాం పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. అనంతరం అన్ని పాఠశాలలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించడం, వారిని స్క్రీనింగ్ చేయుటకు ఎస్సీఈఆర్టీ నూతనంగా ప్రవేశపెట్టిన ప్రశస్త యాప్ వినియోగం, స్క్రీనింగ్ చేయుటకు సంబంధించిన వివిధ అంశాల పట్ల రిసోర్స్ పర్సన్ రాజశేఖర్‌రావు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు సుధాకర్‌రెడ్డి, సెక్రెటరీలు శివప్రసాద్, రామకృష్ణ, రిసోర్స్‌పర్సన్లు రఘురాంరెడ్డి, రాజశేఖర్‌రావు, ఐఈఆర్పీ రాజవర్ధన్‌రెడ్డి, క్లస్టర్ రిసోర్స్‌పర్సన్ శ్యాంసుందర్, ఆయా పాఠశాలల ఆంగ్ల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## తక్కువ అక్షరాస్యత ఉన్న ప్రాంతాలలో ప్రత్యేక చర్యలు

■అదనపు కలెక్టర్ నర్సింగరావు



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నర్సింగరావు

**గద్వాల సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:** నిరక్షరాస్యత నిర్మూలనకు, తక్కువ అక్షరాస్యత ఉన్న ప్రాంతాలలో ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు అధికారులకు ఆదేశించారు. మంగళవారం ఐడిఓసి లోని తన ఛాంబర్‌లో న్యూ ఇండియా లిటరసీ కార్యక్రమంపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యూ ఇండియా లిటరసీ స్కీంలో భాగంగా ప్రతి గ్రామంలో సంపూర్ణ అక్షరాస్యత సాధనకు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న అందరిని భాగస్వామ్యం చేస్తు అక్షరాస్యతను పెంపొందించడంపై జిల్లా అధికారులు పని చేయాలన్నారు. ఈ సంవత్సరం 51703 మందిని అక్షరాస్యులుగా మార్చడంలో దోహదపడేలా, గతంలో పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి ద్వారా నమోదైన 1,81,114 మంది నిరక్షరాస్యులను గుర్తించడం జరిగిందని అన్నారు. తక్కువ అక్షరాస్యత ఉన్న కేటిదొడ్డి, గట్టు, ధరూర్ ఐజ మండలాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో డిపిఓ శ్యాంసుందర్, డియం.హెచ్ఓ సిద్దప్ప, అడిషనల్ డిఆర్డిఓ నరసింహులు,మున్సిపల్ కమిషనర్లు దశరథ్‌లక్ష్మారెడ్డి, సరస్వతి, న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాం జిల్లా అధికారి అనిత, జిల్లా సమన్వయ అధికారి హంపయ్య తదితరులు ఉన్నారు.

## స్వచ్ఛతను జీవన విధానంగా మార్చుకోవాలి

**-నాగర్‌కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్ దేవసహాయం**



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:** పరిసరాల పరిశుభ్రత కాపాడుకోవడమే కాకుండా స్వచ్ఛతను జీవన విధానంగా మార్చుకోవాలని నాగర్‌కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్ దేవసహాయం అన్నారు. స్వచ్ఛతహీ సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని బాలికల పాఠశాల నుంచి ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి అడిషనల్ కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై పాల్గొన్నారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు కూడా ఆరోగ్య పరిరక్షణ కోసం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచు కోవాలని సూచించారు. మన ఇంటి పరిసరాల్లో నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలన్నారు. అనంతరం పట్టణంలోని బాలికల పాఠశాల నుంచి విద్యార్థులతో కలిసి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరుతూ ప్రతిజ్ఞ చేశారు.కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళితో పాటు మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, మెప్మా సిబ్బంది, జిల్లా యూత్ స్పోర్ట్స్ ఆర్గనైజేషన్ సభ్యులు, పాఠశాల, కళాశాల విద్యార్థులు తదితరులు ఉన్నారు.

## రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న రేషన్ డీలర్లు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:** ప్రజాభిప్రాయం మేరకు రేషన్ షాపుల్లో జనవరి నుంచి సన్నబియ్యం అందించుటకు నిర్ణయించినందున ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ రేషన్ డీలర్లకుగౌరవ వేతనం రూ.5వేలు అందించి కమిషన్ పెంచే ప్రతిపాదననుఅమల్లోకి తెచ్చేలా సీఎం, పౌరసరఫరాల శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లాని ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించారు. ప్రభుత్వం మెనిఫెస్టోలో ప్రకటించినట్లు రేషన్‌షాపుల్లో జనవరి 2025 నుంచి సన్నబియ్యం ఇవ్వనున్నట్లు క్యాబినేట్ నిర్ణయించడం పట్ల నియోజకవర్గ రేషన్ డీలర్ల పక్షాన తమద్వారా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు.రేషన్ డీలర్లకు గౌరవ వేతనం రూ.5వేలు పెంచి తమను ఆదుకోవాలన్నారు. ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించిన వారిలో జిల్లా అధ్యక్షులు సాధిక్‌పాషా, ఆయా మండలాల రేషన్ డీలర్లు తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమ ప్రభుత్వం

■మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



సమావేశంలో మాట్లాడుతున్న మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

**అమరచింత సెప్టెంబర్24 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమ ప్రభుత్వమని రుజువు చేస్తుందని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మంగళవారం అమరచింత మండలంలోని నాగల్‌కడుమూర్,అమరచింత మున్సిపల్ కేంద్రంలో మహాలక్ష్మిపథకం ద్వారా 500 కే సిలిండర్ మంజూరైన లబ్దిదారులకు మక్తల్ ఎమ్మెల్యే, వాకిటి శ్రీహరి పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజుగౌడ్‌తో కలిసి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మక్తల్ ఎమ్మెల్యే వాకిట శ్రీహరి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో ఆరు గ్యారెంటీలు ప్రజలకు హామీ ఇచ్చిందని అందులో మహిళలకు ఉచిత ప్రయాణం,15 లక్షల ఉచిత వైద్యం, మహిళలకు మహాలక్ష్మి పథకం రైతులకు రెండు లక్షలరుణమాఫీ 200 యూనిట్ల విద్యుత్ పథకాలు అమలు చేశామని ఆయన అన్నారు. గత పాలనలో రైతు లు అనేక ఇబ్బందులు పడ్డారని కాంగ్రెస్ ప్రభుత్వ హయం లో రెండు లక్షల రుణమాఫీ ఏకదాటిగా చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దేనిని ఆయన అన్నారు. అలాగే నాగల్‌కడుమూర్ గ్రామంలో 347 రైతులకు నాలుగు కోట్ల 60 లక్షలు రుణమాఫీ రైతుల ఖాతాలో జమ చేయడం జరిగిందని నాగల్ కడుమూర్ రైతులు ఆనందంగా ఉన్నారని ఆయన అన్నారు. త్వరలో సబ్ స్టేషన్ నిర్మాణానికి భూమి పూజ చేస్తామని ఆయన అన్నారు. బడుగు బలహీనవర్గాల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ప్రభుత్వానికి రైతులు ప్రజలు అండదండాలు ఉండాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో డిసిసి జిల్లా కార్యదర్శి అయూబ్ ఖాన్, జగదీశ్వర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ,వైస్ చైర్మన్ జిఎస్‌గోపి, ఎంపీడీవో శ్రీనివాసులు, తాహసిల్దార్ రమేష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కేజీ మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అరుణ్‌కుమార్, మున్సిపల్ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



మహాలక్ష్మి లబ్ధిదారులకు ప్రొసిడింగ్ కాపీలను అందజేస్తున్న మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

## మార్కెట్ యార్డ్ చైర్మన్‌కు సన్మానం



మార్కెట్ యార్డ్ చైర్మన్‌ను సన్మానిస్తున్న వనపర్తి ఎమ్మెల్యే

**ఇటిక్యాల సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:** పెబ్బేర్ మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా ప్రమోదిని పాండేశ్వర్‌రెడ్డి మంగళవారం పదవి ప్రమాణ స్వీకారం వనపర్తి ఎమ్మెల్యే మెగారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా అలంపూర్ యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎర్రవల్లి మాజీ సర్పంచ్ జోగుల రవి ఎర్రవల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ నూతన మార్కెట్ యార్డ్ చైర్మన్‌ను శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

## విజయవంతంగా ముగిసిన వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

**తెల్కపల్లి,సెప్టెంబరు 24 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వేరోస్, విస్డం లీడ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన వ్యాసరచన పోటీలు విజయ వంతంగా ముగిశాయి. ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డపాకుల శివశంకర్ మాట్లాడుతూ రానున్న మహాత్మాగాంధీ 155వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఈ వ్యాసరచన పోటీలు నిర్వహించామని, ఈ పోటీలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేయనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ సెక్రెటరీ సంపత్‌కుమార్, మబ్బు రాము, భాస్కర్ పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్‌లో దివ్యాంగుల ఫిర్యాదు



పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న దివ్యాంగులు, కాంగ్రెస్ నాయకులు

**బిజినపల్లి,సెప్టెంబరు 24 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బంగారి పర్వతాలు తన వికలత్వంపై అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలని మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జిల్లా దివ్యాంగుల సంఘం ఆధ్వర్యంలో పలువురు మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా దివ్యాంగుడైన బంగారి పర్వతాలుకు ఫోన్ చేసి వేధింపులకు గురి చేయడమే కాక, మనోవేదనకు గురి చేసిన వ్యక్తిపై విచారణ చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం జిల్లా ఎస్పీని కలిసి ఫిర్యాదు అందజేసినట్లు వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మిద్దె రాములు,మాజీ సర్పంచ్ అమృత్‌రెడ్డి,మ్యాతరి సత్యం, పురుషోత్తం, యాదగిరి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలకు గ్రీన్ బోర్డులు విరాళం



ప్రభుత్వ పాఠశాలకు అందించిన గ్రీన్ బోర్డులు

**బిజినపల్లి,సెప్టెంబరు24 ప్రభాతవార్త:** కారుకొండ ప్రాథమికోన్నత పాఠశాలకు రూ. 20 వేలు విలువ చేసే 7 గ్రీన్ బోర్డులు, 2 మార్కర్ బోర్డులు మాజీ సర్పంచ్ గుడిసె తిరుపతయ్య, గ్రామ యువకుడురెడ్డి, రాకేష్‌రెడ్డివిరాళంగా అందించారు. మాజీ సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను కాపాడు కోవడం ప్రతి ఒక్కరిబాధ్యతగా గుర్తెరగాలన్నారు.గతంలో కూడా పాఠశాల విద్యార్థులకు కావలసిన నోటుబుక్కులు, సైన్ బోర్డులు విరాళంగా ఇవ్వడం జరిగిందనితెలిపారు. రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులుప్రతిరోజు విద్యార్థులను క్రమం తప్ప కుండా పాఠశాలకు పంపించాలన్నారు. వారికి ఎల్లప్పుడు మా సహాయ సహకారాలు అందుతాయని వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ విరాళంగా బోర్డులు ఇచ్చిన దాతలకు ప్రత్యేకమైనధన్యవాదాలు తెలిపారు.ఉపాధ్యాయులు ఇంద్రాణి, చైతన్య, భాగ్యలక్ష్మి, లావణ్య, భారతి, మేఘన ఉన్నారు.

## 29న షూటింగ్ బాల్ ఎంపిక



మాట్లాడుతున్న పీఈటీ గోపాలం

**మక్తల్,సెప్టెంబరు 24 ప్రభాతవార్త:** జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 29న మక్తల్ మిని స్టేడియంలో షూటింగ్ బాల్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, విశ్రాంత పీఈటి బి.గోపాలం తెలిపారు. మంగళవారం మక్తల్‌లో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాస్థాయి జూనియర్స్ షూటింగ్ బాల్ బాలబాలికల ఎంపికలు మిని స్టేడియం గ్రౌండ్‌లో నిర్వహించి, క్రీడా నైపుణ్యతను ప్రదర్శించిన వారిని ఎంపిక చేసి, రాష్ట్రస్థాయి క్రీడలకు పంపుతామని ఆయన తెలిపారు. రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ జూనియర్స్ బాలబాలికల టోర్నమెంట్ కం సెలక్షన్ అక్టోబర్ 3 నుండి 5 వరకు సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో జరిగే రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌కు పంపుతామన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని షూటింగ్ బాల్ క్రీడల్లో ఆసక్తి గల బాల బాలికలు 01.04.2005 తర్వాత జన్మించిన వారు ఈ పోటీలకు అర్హులన్నారు. పోటీల్లో పాల్గొనే బాల బాలికలు తమ బోనఫైడ్, ఆధార్‌కార్డుతో రిపోర్టు చేయాలని తెలిపారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు తాన్‌సింగ్, నిర్వహణ కార్యదర్శి అమ్రేష్, రమేష్, దామోదర్, ఎన్.రాఘవేందర్ పాల్గొన్నారు.

### ఉచితంగా కంటి అద్దాల పంపిణీ

**మక్తల్,సెప్టెంబరు 24 ప్రభాతవార్త:** పట్టణంలోని మారుతి కంటి ఆసుపత్రి యజమాని కె.మోహన్‌భట్ జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళవారం ఆసుపత్రి ఆవరణలో పేదలకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అనంతరం రోగులకు ఉచితంగా కంటి అద్దాలతో పాటు మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సంగీత, వెంకటేష్ పాల్గొన్నారు.

## క్రీడలతో మానసిక ఉల్లాసం.. శారీరక ధృడత్వం

**- నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి**



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:** విద్యార్థులు విద్యతో పాటుక్రీడల్లో కూడా ప్రతినిత్యం పాల్గొనడం ద్వారా మానసిక ఉల్లాసం కలుగడమే కాకుండా శారీరక ధృఢత్వం ఏర్పడు తుందని ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాల ఆవరణలో మండల స్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యతో పాటు క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ముందుకు వస్తుందన్నారు. విద్యార్థులు క్రీడల్లో రాణించి నియోజకవర్గ పేరు ప్రతిష్టలను జాతీయ స్థాయిల్లో రాణించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని, అందుకు కావాల్సిన అవసరాలను తన దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనేక మంది క్రీడాకారులు క్రీడల్లో రాణించి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములవు తారని, వారిని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు ప్రతిభను చాటాలని కోరారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

## బాలికలు అన్ని రంగాలలో రాణించాలి

**■గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్‌రెడ్డి**



ఎమ్మెల్యేని సన్మానిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు

**గద్వాల, సెప్టెంబర్24 ప్రభాతవార్త:** బాలికలు అన్ని రంగాలలో రానిస్తు న్నారని, భవిష్యత్తులో ఇంకా రాణిం చాలని గద్వాల ఎమ్మెల్యే కృష్ణ మోహన్‌రెడ్డి అన్నారు. గద్వాల జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో 68వ ఎస్ఎఫ్ జిఅండర్ 14,17 బాలికల జిల్లా స్థాయి టోర్నమెంట్ ప్రారం భోత్సవానికి ముఖ్యఅతిథిగా గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి పాల్గొని ప్రారం భించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడారంగంలో కూడా నైపుణ్యం పొంది ఉండాలని, క్రీడల వల్ల మనకు మానసికంగా, శరీరకంగా, దృఢత్వాన్ని పెంచుతుందన్నారు. క్రీడల వల్ల ఎన్నో లాభా లు ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరు క్రీడలలో మంచి నైపుణ్యత ను సాధించాలన్నారు. నేడు జరగ బోయే జిల్లా స్థాయి టోర్నమెంటల్లో పాల్గొని క్రీడలను మంచిగా ప్రదర్శించాలని కోరారు. జిల్లా స్థాయి నుండి భవిష్యత్తులో రాష్ట్ర స్థాయి టోర్నమెంట్ లో కూడా గద్వాల చెందిన బాలికలు మంచిగా తమ క్రీడా నైపుణ్యాత ను ప్రదర్శించి గద్వాల ప్రాంతానికి మంచి పేరు ప్రతిష్టలు వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. భవిష్యత్తులో మంచి క్రీడాకారిగా ఎదగాలని కోరారు. ప్రతి ఒక క్రీడాకారులు గెలుపు ఓటమి సమానంగా స్వీకరించాలన్నారు. ఓటమి విజయానికి నాంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మురళి, మాజీ ఎంపీపీ విజయ్, మాజీ సర్పంచ్ మాజీద్, మాజీ ఎంపీటీసీ ఆనంద్‌గైడ్ నాయకులు గోవిందు,ఆలూరు రామయ్యశెట్టి,కురుమన్న,ధర్మ నాయు డు, పవన్ యాదవ్, వీరేష్,గాంధీ, మహేష్, క్రీడాకారులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



కుటుంబం దగ్గర మాట్లాడుతున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి రూరల్ సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:** శ్రీరంగాపురం మండ లం నాగరాల గ్రామం సెంటర్ 1కు చెందిన పులేందర్ కుటుం బాన్ని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మంగళవారం పరామ ర్శించారు. సోమవారం పులేందర్ కుటుంబం రోడ్డు ప్రమాదానికి గురై ఇద్దరు మృతి చెందిన విషయాన్ని తెలుసు కున్న ఎమ్మెల్యే వారి కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబం అధైర్య పడకూడదని కుటుంబా నికి తను ఎల్లవేళలా అండదండగా ఉంటానని ఎమ్మెల్యే వారికి భరోసా కల్పించారు. చిన్నారుల విద్యా భ్యాసం ఇందిరమ్మ ఇల్లు కుటుంబానికి కావాల్సిన అందే సదుపాయాలను ఏర్పాటు చేయి స్తామని ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాధిత కుటుం బానికి తక్షణ సహాయంగా 20వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో శ్రీరంగ పురం,పెబ్బేరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు పోసిడింగ్ కాపీలు అందజేత



**దేవరకద్ర,సెప్టెంబరు 24 ప్రభాత వార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీల అమలులో భాగంగా మహాలక్ష్మి పథకం కింద గ్రామీణ ప్రాంతాలలోని పేద మహిళలంద రికి రూ. 500లకే వంట గ్యాస్ సిలిండర్ అందించే పథకాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వం ప్రారంభించింది. ఇందులో భాగంగానే కౌకుంట్ల మండల కేంద్రంలో గల రైతువేదిక భవనం దగ్గర అర్హులైన మహిళలందరికి ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి (జిఎంఆర్) ,టిపిసిసి ఆర్గనైజింగ్ సెక్రెటరీ కొత్త అరవింద్‌కుమార్‌రెడ్డి ధృవపత్రాలు అందజేయడం జరిగింది. పేరూర్ గ్రామంలో మిగతాఅర్హులైన లబ్దిదారులందరికి టిపిసిసిఆర్గనైజింగ్ సెక్రెటరీ కొత్త అరవింద్ కుమార్‌రెడ్డి, గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ధృవపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అశోక్‌కుమార్,గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,సగర సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌సి శ్రీనివాస్‌సాగర్,బండారి శ్రీనివాస్ యాదవ్, ముచ్చింతల కిష్టారెడ్డి, కలా ల్ రమేష్‌గౌడ్,ముచ్చింతల చంద్రారెడ్డి,బండారి బురాన్ యాదవ్, నడిమింటి సంఘపాగ వెంకటేష్ (మహిళలు), సిలిండర్ లబ్దిదారులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమం విజయవంతం చేశారు.

## మంత్రుల పర్యటనను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

**కొత్తకోట సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:** కొత్తకోటకు మండల కానాయపల్లి శంకరసముద్ర రిజర్వా యర్ ను పరిశీలించడానికి రాష్ట్ర మంత్రులు విచ్చేస్తున్న సందర్భంగా ముందస్తు ఏర్పాట్లను దేవర కద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి పరిశీలించారు. మధ్యాహ్నం 12 గంటలకు హెలికాప్టర్ లో వస్తుండగా అట్టి హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు.పర్యటనలో భాగంగా ఎలాంటి అవాంఛా నియా సంఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకోవాలని జిల్లా పోలీస్ యంత్రాంగానికి ఆదేశించారు. కొత్తకోట మండలం శంకర్ సముద్రం ఆర్ అండ్ ఆర్ ప్యాకే జీ సంబంధించి కనాయపల్లి శంకర్ సముద్రం పర్యటించేందుకు మంత్రులు జిల్లా ఇంచార్జ్, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వర్యులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, టూరిజంఅండ్ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావువిచ్చేస్తున్న సందర్భంగా అధికారులతో కలిసి అక్కడ ఏర్పాట్లను ఎమ్మెల్యే పరిశీలించారు.

## ఘనంగా జాతీయ సేవా పతక ఆవిర్భావ దినోత్సవం

**బిజినపల్లి,సెప్టెంబరు 24 ప్రభాతవార్త:** జాతీయ సేవా పతకం విద్యార్థుల భావి జీవితానికి పునాది బాటలు వేస్తుందని ఇంఛార్జి ప్రిన్సిపల్ డా. సుష్మా అన్నారు. శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ సైన్స్ కళాశాల (అటానమస్) పాలెంలో జాతీయ సేవా పతకం దినోత్సవం నిర్వహించారు. ఇంఛార్జి ప్రిన్సిపల్ మాట్లాడుతూ సేవా పతకం విద్యార్థుల్లో తోటివారిని గౌరవించుకోవడంతో పాటు సమా జం పట్ల ఒక స్పష్టమైన అవగాహన ఏర్పడేలా చేస్తుందన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు విద్యార్థులను ఉద్దేశించి ఈ జాతీయ సేవా పతకం ఆవిర్భావ దినోత్సవం 1969 అక్టోబర్ 2న గాంధీ జయంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేయడం జరిగిందని ఇలాంటి సామాజిక సేవలో విద్యార్థులు పాల్గొనడం వలన వారి వ్యక్తిత్వ వికాసం అభివృద్ధి చెందడంతో పాటు సామాజిక బాధ్యత ఉన్నతమైనపౌరులుగా తీర్చిదిద్దబడతారని అన్నారు. కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్ యూనిట్, వాలంటీర్లు కళాశాల ఆవరణలో వ్యర్థ పదార్థాలను, ప్లాస్టిక్‌ను సేకరించి పరిసరాలను శుభ్రపరిచివారి సామాజిక సేవ స్పృహను చాటుకున్నారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్ అధికారి డా.సి. నాగరాజు, ఎన్ఎస్ఎస్ యూనిట్ 2 అధికారి డి.శివ, అధ్యాపక బృందం రాధ, స్వప్న, నాగలింగం, వెంకటేష్, రమేష్, ప్రకాష్, మనోజ్, ప్రవళిత, రమ్య, అధ్యా పకేతర బృందం కవిత, కురుమయ్య, బాలస్వామి, అక్బర్, నగేష్ పాల్గొన్నారు.

### సభ్యత్వ నమోదు కార్యక్రమం

**దేవరకద్ర,సెప్టెంబరు 24 ప్రభాతవార్త :** దేవరకద్ర నియోజకవర్గంలోని డోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి నివాసంలో జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు డికె అరుణ, రాష్ట్ర క్రమశిక్షణ సంఘం ఛైర్మన్ ధర్మారావుతో కలిసి బిజెపి నియోజకవర్గ ఇంఛార్జి కొండ ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో కార్యకర్తలు, నాయకులు ప్రతి ఒక్కరూ ప్రతి గ్రామంలో పెద్ద ఎత్తున సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లాఅధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి,సీనియర్ నాయకులు యజ్ఞభూపాల్‌రెడ్డి, రమేష్‌బాబు, మాధవరెడ్డి, నారాయణరెడ్డి,దేవరకద్ర మండలఅధ్యక్షుడు కృష్ణంరాజు, ఓబిసి కార్యవర్గ సభ్యుడు దేవన్నసాగర్, రాచల రాజు, తిమ్మన్న, హోటల్ అంజి, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రూ.100కోట్లతో ఊర్కొండ మండలాభివృద్ధి

- **బీఆర్ఎస్ పాలనలో ఊర్కొండ మండలం నిర్లక్ష్యానికి గురైంది**
- **నియోజకవర్గంలోని అన్ని మండలాలతో సమానంగా ఊర్కొండ మండలాభివృద్ధి : ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి**
- **ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు షూ పంపిణీ**

**ఊర్కొండ, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:** ఊర్కొండ మండలాన్ని రూ.100కోట్లతో అన్ని రంగాల్లో అభివృద్ధి చేయనున్నట్లు ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి పేర్కొన్నారు.గత పదేళ్ల బీఆర్ఎస్ పరిపాల నలో ఊర్కొండ మండలం నిర్లక్ష్యానికి గురై అభివృద్ధికి నోచుకోలేక పోయిందని ఎమ్మెల్యే వాపోయారు. ఊర్కొండ మండలానికి ఇప్ప టికే ఇండోర్ స్టేడియం మంజూరైందని, ఆర్అండ్‌బి, పంచాయతీ రాజ్ తదితర విభాగాల నుంచి దాదాపు రూ.100కోట్లు మంజూరు కానున్నాయని ఎమ్మెల్యే ప్రకటించారు. ఊర్కొండ మండలం ఇప్పఎ హడ్ గ్రామంలో మంగళవారం ఆయన ప్రభుత్వ పాఠశాలలో చదు వుతున్న విద్యార్థులకు షూ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో భాగంగా మండలాభివృద్ధికి తాను ఇచ్చిన ప్రతి హామీని నేరుస్తానని, అవసరమైన నిధులను తీసుకొచ్చి జడ్చర్ల నియోజక వర్గంలోని అన్ని మండలాలతో సమానంగా ఊర్కొండ మండలాన్ని



విద్యార్థులకు షూ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే



ఎమ్మెల్యేపై పూల వర్షం కురిపిస్తున్న విద్యార్థులు

అన్ని రంగాల్లో సమానంగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. గతంలో జకినాలపల్లిలో చెరువు నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరగా చెరువు నిర్మాణానికి నిధులను మంజూరు చేయించానని, ప్రస్తుతం దీనికి సంబంధించి టెండర్ల ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. పంచాయతీ రాజ్ శాఖ ద్వారా రూ.5కోట్ల నిధులు కూడా మంజూర య్యాయన్నారు. ఊర్కొండ మండలానికి ఇండోర్ స్టేడియం మంజరై నట్లు ఎమ్మెల్యే తెలిపారు. మండలంలోని రోడ్ల నిర్మాణాల కోసం ఆర్అండ్‌బీ ద్వారా రూ.60కోట్ల నిధుల కోసం ప్రతిపాదనలు సమ ర్పించామని, ఈ నిధులు వచ్చే యేడాది మార్చి నెల నాటికి మంజూ రవుతాయన్నారు. ఊర్కొండ మండలంలో ప్రభుత్వ కార్యాలయా లకు భవనాలు లేవని, ఇంటిగ్రేటెడ్ భవన నిర్మాణం కోసం రూ.16 కోట్ల ప్రతిపాదనలు పంపించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. గత పదేళ్ల కాలంలోబీఆర్ఎస్ ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేసి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిని పట్టించుకోలేదని ఆయన దుయ్య బట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్నా రని, వారందరు విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా విద్యాబోధన గావిస్తున్నారన్నారు.ప్రభుత్వ పాఠశాలలకు సరైన మౌళిక వసతులు లేకపోవడమే శాపంగామారిందని, జడ్చర్లనియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఎలాంటి మౌళిక వసతులు కావాలో తెలుపా లని కోరానని, అట్టి మౌళిక వసతులను దశల వారిగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తానన్నారు. అదే విధంగా మండలంలోని ఇప్పపహడ్,జకినాలపల్లి, బొమ్మరాజుపల్లి,జగబోయిన్‌పల్లి, రాంరెడ్డి పల్లి, ముచ్చర్లపల్లి, ఊర్కొండ, ఊర్కొండ పేట, రాచాలపల్లి, మాధారం, గుడిగానిపల్లి, రేవల్లి, తిమ్మన్నపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు షూ పంపిణీ చేపట్టారు.

**ఎమ్మెల్యేకు పూల వర్షం కురిపించిన విద్యార్థులు...**

జడ్చర్ల నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి ప్రత్యేక కృషి చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా విద్యాబోధన అందిం చాలని, పేద విద్యార్థులందరికి చదువు దక్కాలనే సంకల్పంతో ఎమ్మె ల్యేకు ముందుకు సాగుతున్నారు. మంగళవారం ఊర్కొండ మండ లంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు షూ పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే విచ్చేయడంతో ప్రతి పాఠశాలలో విద్యార్థులు పూల వర్షం కురిపించారు. అనంతరం పలువురు నాయ కులు ఎమ్మెల్యేను శాలువాలు, పూలమాలలో ఘనంగా సన్మానిం చారు.కార్యక్రమంలో తహసీల్దార్ రాంకోటి, ఎంఈఓ శంకర్‌నాయక్, సీఐ నాగార్జున, మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ధ్యాప నికిల్‌రెడ్డి,వెంకటయ్యగౌడ్‌లతో పాటు మండల కాంగ్రెస్ నాయకులు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు ఉన్నారు.



విద్యార్థినితో కరచలనం చేసి వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

# బోగస్ కేసును ఉపసంహరించుకోవాలి

- పేట ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలి
- కేసు ఎత్తేయకపోతే నిరవధిక పట్టణబంద్
- ప్రముఖ న్యాయవాది, బిజెపి రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యుడు నాగురావు నామోజీ

**నారాయణపేట టౌన్,సెప్టెంబరు24 ప్రభాతవార్త:** జిల్లా కేంద్రం లో ఈ నెల 18న రాత్రి జరిగిన ఇరువర్గాల ఘర్షణ విషయంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని ప్రముఖ న్యాయ వాది బిజెపి రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యుడు నాగూరావు నామోజీ పోలీసుల తీరుపై మండిపడ్డారు. మంగళవారం నారా యణపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావే శంలో మాట్లాడుతూ సాక్షాత్తు జిల్లా ఎస్పీ, ఐజి ఆది అనుకో కుండా జరిగిన చిన్న గొడవ అని ఇరువర్గాలను చెదరగొట్టామని పరిస్థితి ప్రశాంతం అని పేర్కొని ఇప్పుడు యువకుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని అన్నారు. ఈ ఘటనలో అటు ముస్లిం లు కానీ ఇటు హిందువులు కానీ ఎలాంటి ఫిర్యాదు చేయకున్నా పోలీసులు అటు 14 ఇటు 14 మందిపై హత్యాయత్నం కేసులు నమోదు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కానీ పోలీసులు నమోదు చేసిన కేసు ఎస్ఐఆర్ చూస్తే పోలీసులకు మతి లేదనిపి స్తోందన్నారు.ఎవరు ఫిర్యాదు చేయకపోయిన పోలీసులే కట్టుకథ అల్లి పిసి నక్క రాములు చేత ఫిర్యాదు ఇప్పించుకుని అందులో ఇరువర్గాలకు చెందినవారు మత కలహాలు సృష్టించేందుకు ప్రయ



మాట్లాడుతున్న నాగురావు నామోజీ

త్నిస్తూ విధులకు అడ్డు తగిలి పోలీసులను చంపాలని రాళ్ళు విసిరారని ఎఫ్ఐఆర్‌లో పేర్కొనడం విచిత్రంగా ఉందన్నారు. కానీ పోలీసులకు ఒక్క రాయి తాకినట్లు కానీ దెబ్బలు తగిలినట్లు పేర్కొనకుండా కేసు నమోదు చేసి హత్యాయత్నం,మారణ హో మం అంటూ సెక్షన్లు పెట్టి రెండు మతాల ప్రజలను భయభ్రాం తులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి కేసులు నమోదు చేస్తే నారాయణపేట ప్రజలు భయపడిపోరని స్పష్టం చేశారు.సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న నారా యణపేట జిల్లాలో ప్రజలను రెచ్చగొట్టే విధంగా పోలీసులు వ్యవహరిస్తున్నారని అన్నారు.సమావేశంలో న్యాయవాది, బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు మదన్,మాజీ కేంద్రప్రభుత్వ జిల్లా ఉపాధ్య క్షుడు మదన్,మాజీ కేంద్ర ప్రభుత్వ సహాయన్యాయవాది రఘువీర్‌యాదవ్, జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ నందు నామాజీ, మైనార్టీమోర్చా రాష్ట్ర నాయకుడు మహబూబ్ అలీ పాల్గొన్నారు.

# మున్సిపల్ ఆదాయానికి గండి

## డబ్బాల నుంచి వచ్చే ఆదాయాన్ని గండి కొడుతున్న మున్సిపల్ అధికారులు?

**వనపర్తి టౌన్ సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:** వనపర్తి పట్టణంలో గవర్నమెంట్ హాస్పిటల్ ఎదురుగా ఉన్న లక్షల రూపాయలు పెట్టి డబ్బాలు తయారయ్యి 9 నెలలు గుడుస్తున్న వాటిని విని యోగంలోకి తీసుకురావడంతో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం గా వహిస్తున్నారు. మున్సిపాలిటీ కి రావాల్సిన ఆదాయాన్ని గండి పడుతున్న పట్టనట్టు వ్యవహరిస్తున్న అధికారుల తీరుపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఉన్నటువంటి వ్యాపారస్తులు 30 సంవత్సరాలుగా వ్యాపారం చేస్తూ జీవనం గడుస్తున్నావారు ఉన్నారు. గతంలో ఉన్న వ్యాపారస్తులకు కొత్త డబ్బాలు వేసి ఇస్తాం మున్సిపల్ అధికారులు వ్యాపారస్తులకు హామీ ఇవ్వడంతో స్వచ్ఛందంగా అక్కడ వారు డబ్బాలను తొల గించరు, అలాంటి వ్యాపారస్తులు ఎప్పుడు ఇస్తారు వేచి చూడ డం తప్పడం లేదు ఇందులో రాజకీయ నాయకుల ప్రాబల్యంతో ఆలస్యం అవుతున్నాయి.కొందరు వ్యాపారస్తులు మొర పెట్టుకుం టున్నారు. గతంలో ఇక్కడ ఉన్నటువంటి వ్యాపారస్తులకు ఒకటి చొప్పున డబ్బాలను కేటాయిస్తామని మున్సిపల్ అధికారులు హామీ ఇవ్వడం జరిగింది. కానీ రాజకీయ నాయకుడు తన పేరు మీద తన బంధువుల పేరు మీద డబ్బాలు తీసుకోవాలి ప్రయ త్నాలను చేస్తున్నాడు.నిజమైన వ్యాపారస్తులకు ఇవ్వాలి అక్క డున్న వ్యాపారస్తులు అధికారులకు రాజకీయ ప్రజాప్రతినిధులకు విన్నపం చేస్తున్నాం అని తెలిపారు. వనపర్తి మున్సిపాలిటీ లో పనిచేస్తున్న ఉద్యోగస్తులకు జీతాలు లేక ఇవ్వలేని పరిస్థితుల్లో ఉన్న మున్సిపాలిటీకి ఇలాంటి ఆదాయం పనిచేస్తున్న కార్మి కులకు కాస్త కోస్తా అయినా ఆదాయం చేకూరుతుంది కనీసం పట్టించుకోకపోవడంప్రజలు అసహనం వ్యక్తంచేస్తున్నారు. ఇప్ప



వ్యాపారస్తుల కోసం పూర్తి అయిన డబ్బాలు

టికే డబ్బాల వల్ల మున్సిపాలిటీకి రావాల్సిన ఆదాయం ఆవిరి అయిందని, ఒక్క డబ్బాకు నెలసరి అద్దె రూ.3000 ప్రకారం లెక్క వేసుకున్న 11డబ్బాలకు రూ.33000 నెలకు వచ్చే అవ కాశం ఉంది. ఈ లెక్క ప్రకారం గడిచిన తొమ్మిది నెలలుగా పూర్తిగా సిద్ధంగా ఉన్న డబ్బాలు వృధాగా ఉండటం వల్ల దాదా పు మూరు లక్షల ఆదాయం మున్సిపల్ ఖజానాలో జమ కాకుం డా వృధాగా ఉండటం వల్ల దాదాపు మూడు లక్షల ఆదాయం మున్సిపల్ ఖజానాలో జమ కాకుండా వృధా అయ్యిందని పట్టణ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

**మున్సిపల్ చైర్మన్ వివరణ :**



మున్సిపల్ చైర్మన్ మాట్లా డుతూ వ్యాపారస్తులకు డబ్బా లను కేటాయిస్తాం ఇప్పటికే వారికి డి.డి కట్టమని ఆదేశం ఇవ్వడం జరిగింది.నిజమైన వ్యాపారస్తులకు డబ్బాలు కేటాయిస్తాం ఇందులో ఎక్కడ కూడా రాజకీయం చూడ కుండా పేదవారికి అందించాలి అని కాంగ్రెస్ ప్రభుత్వ, ఎమ్మెల్యే మెఘారెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారు అని తెలిపారు.

# ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచుకోవాలి

**బిజినపల్లి,సెప్టెంబరు 24 ప్రభాతవార్త:** ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో సన్న,చిన్నకారు రైతులు ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచుకోవడానికి సమగ్ర వ్యవసాయం చేపట్టాలని అటారి జోన్ 10 డైరెక్టర్ డా. షేక్ ఇన్‌మీరా అన్నారు. పాలెం కృషి విజ్ఞాన కేంద్రంలో సమగ్ర వ్యవసాయ విధానం, ప్రదర్శన శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రదర్శన భవనం ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. డైరెక్టర్ డా. షేక్ ఇన్ మీరా మాట్లాడుతూ సమగ్ర వ్యవసాయ విధానం వల్ల రైతులు సహజ వనరులను కాపాడుకుంటూ వ్యవసాయంలో అధిక ఆదాయం పొందే అవకాశాలున్నాయన్నారు. నాబార్డు సిజిఎం సుశీల చింతల మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లా వర్షా ధారం మీద ఆధారపడి రైతులు పంటలనుసాగు చేస్తారని తక్కువ పెట్టుబడితో కూడిన వ్యవసాయ విధానాలను చేపట్టి సన్న,చిన్న కారు రైతులు ఏడాది పొడవునా ఆదాయం పొందాల న్నారు. నాబార్డు సంస్థ రైతులకు వ్యవసాయం అనుబంధ రంగా ల్లో రుణాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉందన్నారు. విస్తరణ సంచాల కులు డా.బి. జమునారాణి మాట్లాడుతూ మన చుట్టు వనరుల ఆధారంగా వ్యవసాయాన్ని చేపట్టినట్లయితే ఆర్థికంగా సుస్థిరంగా



ప్రదర్శన భవనం ప్రారంభోత్సవం చేస్తున్న అధికారులు

ఉండవచ్చని వివరించారు. వ్యవసాయ పరిశోధన కేంద్రం ఎడిఆర్ డా. ఎం మల్లారెడ్డి మాట్లాడుతూ వ్యవసాయంలో ఇతర అనుబంధ రంగాలను చేపట్టినట్లయితే నికర ఆదాయాన్ని పెంపొందించుకోవడంతో పాటుపంట వ్యర్థాలను సమర్థవంతం గా ఉపయోగించుకోవచ్చని వివరించారు.ప్రధాన శాస్త్రవేత్త డా.ఎం.గోవర్ధన్ మాట్లాడుతూ సమగ్ర వ్యవసాయంలో వివిధ రంగాల ప్రాముఖ్యతను యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన కేంద్రం, కృషి విజ్ఞాన కేంద్రం, నాబర్డు, ఏటి ఏఆర్ఐ, వ్యవసాయ శాఖ ఎల్డీఎం నాగర్‌కర్నూల్ సిబ్బంది పాల్గొన్నారు.

## తెలుగు ఉపాధ్యాయుల సముదాయ సమావేశం

**లింగాల,సెప్టెంబరు 24 ప్రభాతవార్త :** తెలుగు ఉపాధ్యాయుల సముదాయం సమావేశం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. పాఠశాలలో నిర్వహించిన సముదాయ సమావేశం ప్రధానోపాధ్యాయులు బషీర్ అహ్మద్ ఆధ్వ ర్యంలో నిర్వహించారు. లింగాల, బల్మూరు, ఉప్పునుంతల మండలాలకు చెందిన తెలుగు ఉపాధ్యాయులు ఈ సముదాయం సమావేశంలో పాల్గొన్నారు. ఇందులో న్యాస్, లిప్ ప్రోగ్రాంపై ఆర్పీలు తరగతులు నిర్వహించారు.

## నేడు నాగర్‌కర్నూల్ జిల్లాలో మంత్రుల బృందం పర్యటన

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లాలోని పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా కొల్లాపూర్ మండలం ఏల్లూరు రిజర్వాయర్, బిజినపల్లి మండలం వట్టెం వద్ద నిర్మిస్తున్న వెంకట్రాద్రి రిజర్వాయర్లను రాష్ట్ర నీటి పారు దల శాఖమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రివర్యులు, రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ్మ, జిల్లా మంత్రి వర్యులు, ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావులతో కూడిన మంత్రుల బృందం బుధవారం సందర్శించి అక్కడ చేపడు తున్న పనులను పరిశీలిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. అనం తరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజాపతినిధులు,ఆయా జిల్లాలకలెక్టర్లు, ఉన్నతాధికారులతో ఉమ్మడి పాలమూరుజిల్లా సాగునీటిప్రాజెక్టులపై సమీక్ష సమావేశం నిర్వహిం చనున్నట్లునాగర్‌కర్నూల్ జిల్లాకలెక్టర్‌బదావత్ సంతోష్ పేర్కొన్నారు.

## 24 గంటలు 41 కాన్పులు..

మొదటిపేజీ తరువాయి భాగం..

వెల్లడిం చారు. ఈ 41 కాన్పుల్లో నార్మల్ డెలివరీ 10, సీజేరియన్స్ డెలివరీలు 31 జరిగాయని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సురక్షితంగా తల్లిబిడ్డ క్షేమంగా ఉండేలాఅన్ని వసతులు కల్పించబడ తాయని, ప్రభుత్వ ఆసుపత్రిలోనే డెలివరీ చేసుకోవాలని సూపరిం టెండెంట్ సూచించారు. జనరల్ ఆసుపత్రిలో ప్రత్యేక మాతా, శిశు సంరక్షణ కేంద్రంలో 24గంటల వైద్య సేవలుఅందుబాటులో ఉన్నా యని తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ వైద్య సేవలను సద్విని యోగం చేసుకోవాలని కోరారు. ఓజిబి డిపార్టుమెంట్‌లోని వైద్యులు, హెచ్ఓడి,ప్రొఫెసర్ డా.సంగీత, డా.లక్ష్మిపద్మప్రియ,డా. ఆశాజ్యోతి, డా.స్ఫూర్తి, డా.సరిత, డా.అర్చన, డా.సోఫియా, డా. రూహి, డా. షహనాజ్, డా. సురేఖలను అభినందించారు.

## 6 గ్యారెంటీల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీయాలి

మొదటిపేజీ తరువాయి భాగం..

రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో ప్రకటించినప్పటికి కేవలం 40 శాతం మందిరైతులకు మాత్రమే రుణమాఫీ పూర్తిచేసి రాష్ట్ర మంత్రివర్గం లోని సభ్యులు ఎవరికి తోచిన విధంగా వారు ప్రకటనలు గుప్పం చడం హాస్యాస్పదంగా ఉందని ఆమె తీవ్రస్థాయిలో విమర్శించారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసే విధంగా తక్షణమే చర్యలు చేపట్టాలని లేనిపక్షంలో తగినమూల్యం చెల్లించుకోవాల్సింది వస్తుందని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి ఆత్మకూరు మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అశ్విని ,కుమార్,అధ్యక్షతవహించగా మఖ్తల్‌నియోగజకవర్గం బంగ్లా లక్ష్మీ కాంత్‌రెడ్డి ,కొండయ్య,శ్రీనివాసులు, రాజు, తంబలి, వెంకటేష్, కంబాలపురం రాము తదితరులతో పాటుగా పలువురు నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## చెంచుల అభ్యున్నతికి కృషి చేయాలి

మొదటిపేజీ తరువాయి భాగం..

అధికారులు ఆయుష్మాన్ భారత్ కార్డులను సర్వే ఫాంలా ఆధారంగా చెంచు సభ్యుల జాబితాను తయారు చేసి అందరికి జారీ అయ్యేలా చూడాలని వైద్య ఆరోగ్య శాఖను కలెక్టర్ ఆదేశించారు. చెంచులకు ఎవరికైతే బ్యాంక్ ఖాతాలులేవో వారందరికిజన్‌దన్ బ్యాంక్ ఖాతాల ను ప్రతి ఒక్కరికి ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎల్డీఎంను ఆదేశిం చారు. పట్టా కలిగి ఉన్న కుటుంబ భూ యజమాని మృతి చెందితే వారి కుటుంబసభ్యులకు భూబదలాయింపులను నిరంతర ప్రక్రియ గా కొనసాగించాలని కలెక్టర్ రెవెన్యూ శాఖను అదేశించారు. కార్యక్ర మంలో జిల్లాపశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ జీ.వి.రమేష్, పీడీ డీఆర్డీఏ చిన్నఓబులేష్,జిల్లాపంచాయతీ అధికారి రాంమోహన్ రావు, అచ్చంపేట, కొల్లాపూర్ ఆర్డీఓలు మాధవి, నాగరాజు, వివిధ శాఖల జిల్లా అధికారులు, 8 మండలాల ఎంపీడీఓలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

## కస్తూర్బా విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

మొదటిపేజీ తరువాయి భాగం..

విద్యార్థులను అడిగారు. విద్యాలయంలో జరుగుతున్న పదవ తం గతి ఇంటర్ ఫస్ట్, సెకండ్ ఇయర్ విద్యార్థుల మినీ గ్రాండ్ టెస్ట్‌ను ఆమె పర్యవేక్షించారు. పై అంతస్తులోని డార్మెంటరీ గదిని పరిశీ లించారు. కాగా విద్యాలయంలో డ్రైనేజీ సమస్య ఉందని బోరు మర మ్మతు చేయించాలని, వంటగది పక్కనే ఉన్నఖాళీ స్థలంలో షెడ్డును నిర్మిస్తే విద్యార్థినిలు అల్పాహారం, భోజనం చేసేందుకు అనువుగా ఉంటుందని ఆ విద్యాలయ ఎస్ఓ కలెక్టర్‌ను కోరారు. స్పందించిన కలెక్టర్ డైనింగ్‌హాల్ లేదా అనిప్రశ్నించగా విద్యాలయంలో పాఠశాల తో పాటు, కళాశాల కూడా కొనసాగుతుండడంతో గదుల కొరత ఉందని,డైనింగ్ హాల్‌ను కూడా తరగతి గదులకు వినియోగిస్తున్నట్లు ఎస్ఓ కలెక్టర్‌కు తెలిపారు.అయితే విద్యాలయంలో అత్యంత ప్రాధా న్యతఉన్న పనులను అందుబాటులో ఉన్న నిధులతో చేయించాలని, అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేసి తనకు పంపించాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసిల్దార్‌జయరామ్,ఎంపిడిఓ సాయిలక్ష్మి, ఎంపిఓ ఉదయ్‌శంకర్, కస్తూర్బా విద్యాలయ ఎస్ఓ పాల్గొన్నారు.

